విశాఖపట్టణం
మంగళవారం 30 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:157 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## నేడు విశాఖకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

గిరిజన యూనివర్శిటీ స్నాతకోత్సవానికి హాజరు

పాల్గొననున్న కేంద్ర, రాష్ట్ర విద్యా మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, నారా లోకేశ్

ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి అనిత, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు




2

# విశాఖలో సీఐఐ సమ్మిట్

## 12, 13 తేదీల్లో మళ్లీ నిర్వహణ

రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణపై చర్చ

అమరావతిలో సీఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్

సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో కలిసి సమీక్ష



(అమరావతి - జయజయహే)

నవంబర్‌లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, పొంగూరు నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాన సదస్సుకు ముందు విశాఖపట్నం, రాజమహేంద్రవరం లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించే అంశంపైనా చర్చించారు. ఈ సమావేశాల ద్వారా పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు జరపడమే కాకుండా ప్రాంతీయ స్థాయిలో అవగాహన పెంచాలని నిర్ణయించారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో ఎంఓయూలు, మినిస్టీరియల్ సెషన్లు, ప్లీనరీ సమావేశాలు, కంట్రీ సెషన్లు, బీ2బీ, బీ2జీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ సదస్సుకు దేశీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించనుంది. సదస్సుకు విస్తృత ప్రచారం కల్పించేందుకు జూలై నుంచి ..మిగతా 2లో




## వాయిస్ మెసేజ్‌తో ఫిర్యాదు చేయవచ్చు

మనమిత్ర వాట్సప్‌లో మరో ఫీచర్

త్వరలోనే ఈ సదుపాయం అందుబాటులోకి

గ్రీవెన్స్, కలెక్టర్ కార్యాలయాలకు తిరగనవసరం లేదు

కనెక్టవిటీ సమస్యను వేగంగా పరిష్కరించాలి

ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

(అమరావతి - జయజయహే)

ప్రభుత్వం మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు వేగవంతంగా పౌర సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాట్సప్ గవర్నెన్స్ సదుపాయం తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రభుత్వ సర్టిఫికెట్లు వేగవంతంగా పొందటంతో పాటు ఛలాన్లు, బిల్లులు వంటివి చెల్లించవచ్చు. అన్ని శాఖలకు సంబంధించిన సేవలు డిజిటల్ విధానంలో ఇందులో పొందవచ్చు. అయితే ప్రభుత్వం ఇందులో ఎప్పటికప్పుడు కొత్త సేవలను పొందుపరుస్తూ అనేక మార్పులు చేస్తోంది. ఈ క్రమంలో వాట్సప్ గవర్నెన్స్‌లో ..మిగతా 2లో



## విశాఖలో నారా లోకేశ్

(విశాఖపట్నం - జయజయహే)

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం విశాఖ చేరుకున్నారు. ఆయా ఆయనకు కూటమి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలికారు. తనని కలవడానిని వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లోకేష్ హామీ ఇచ్చారు. రేపు విశాఖ లో నిర్వహిస్తున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో నారా లోకేష్ పాల్గొంటారు.

## షైనింగ్ స్టార్స్ మా అంబాసిడర్లు

విద్యార్థుల కష్టం వల్లే స్కూల్స్ కు పూర్వవైభవం

1.06 లక్షల విద్యార్థులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడులకు

లీప్ యాప్ తో విద్యా ప్రమాణాలు మెరుగు

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ఘనంగా విద్యార్థుల అభినందన సభ



(అమరావతి - జయజయహే)

కష్టపడి చదివి అద్భుత ప్రతిభ కనబరిచిన 'షైనింగ్ స్టార్స్' ప్రభుత్వ పాఠశాలల చరిత్రను తిరగరాశారు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసించారు. ఇటీవల సాధించిన ఉత్తమ ఫలితాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ..మిగతా 2లో




## మూడు భాషల సూత్రానికి మినహాయింపు

తాత్కాలికంగా ఆ నియమానికి సడలింపు

విద్యార్థులు నష్టపోకూడదనే నిర్ణయం

కాంబినేషన్ ను కొనసాగించుకోవచ్చు

సీబీఎస్ ఈ బోర్డు కీలక ప్రకటన

2



## లొంగిపోయిన హెడ్ కానిస్టేబుల్స్

సాయికృష్ణ కేసులో కీలక పరిణామం

సీఐ నాగరాజుకు సహకరించారని అభియోగం

అసాంఘిక కార్యకలాపాలకు సూత్రధారులుగా తేల్చిన సిట్

కస్టడీలోకి తీసుకుని విచారణ చేయనున్న సిట్

(విజయవాడ - జయజయహే)

విజయవాడలో గాదె సాయికృష్ణ మరణం కేసులో కీలక పరిణామం జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, కృష్ణలంక మాజీ సీఐ నాగరాజుకు కుడిభుజాలుగా వ్యవహరించిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. సీఐ అరెస్ట్ అయినప్పటి నుంచి పరారీలో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నాని సూర్యారావుపేట ఏసీపీ కార్యాలయానికి వచ్చి స్వయంగా ..మిగతా 2లో

## నిష్పక్షపాత, కాల పరిమితి విచారణ

అయోధ్య రామ మందిర కానుకల వివాదంపై సుప్రీం

అత్యవసర విచారణకు న్యాయస్థానం నిరాకరణ



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

అయోధ్యలోని ప్రముఖ రామ మందిరంలో కానుకల దొంగతనం, ఆర్థిక అవకతవకలపై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా, కాలపరిమితితో కూడిన విచారణ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జస్టిస్‌లు ఎం.ఎం. సుందరేశ్, శీల్ నాగులతో కూడిన ధర్మాసనం ఈ విషయాన్ని పరిశీలిస్తూ, దీనిపై వేసవి సెలవుల తర్వాత విచారణ చేపడతామని స్పష్టం చేసింది. "ప్రస్తుతానికి ఆకాశమేమీ కూలిపోదు... దీనికి ఇంత తొందర ఎందుకు?" అని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా మౌఖికంగా వ్యాఖ్యానించడం గమనార్హం. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వ్యవహారాలు, పరిపాలనకు సంబంధించిన ఆర్థిక అవకతవకలు, ఇతర ..మిగతా 2లో

## వారి తరుపున కేసు వాదించం

అయోధ్య ట్రస్టుచోరీ నిందితులకు షాక్

యూపీ న్యాయవాదుల సంఘం ఏకగ్రీవ సంచలన ప్రకటన

2

# ఏపీ-ఫస్ట్..!

లాభాపేక్ష లేని సంస్థ ఏర్పాటు

పరిశోధనలు, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం ప్రొత్సాహం

అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో పరిశోధనలు, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వాణిజ్యీకరించడాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏపీ-ఫస్ట్ అనే కంపెనీని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కంపెనీల చట్టం సెక్షన్-8 కింద లాభాపేక్ష లేని ..మిగతా 2లో

# నేడు విశాఖకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### గిరిజన యూనివర్శిటీ స్నాతకోత్సవానికి హాజరు

### పాల్గొనున్న కేంద్ర, రాష్ట్ర విద్యా మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, నారా లోకేశ్

### ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి అనిత, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

( విశాఖపట్నం - జయజయహే)




విశాఖ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక వేడుకకు పటిష్ట ఏర్పాట్లు చేయటంతో పాటు, సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో నోవాటెల్ హోటల్‌తో పాటు ప్రధాన కార్యక్రమ వేదిక వద్ద చేపట్టిన ఏర్పాట్లను మంత్రి సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులతో మాట్లాడుతూ, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొనడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, విశాఖ నగర పోలీస్ కమిషనరేట్, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అధికారులంతా సమష్టి కృషితో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రపతి భవన్ నుంచి జారీ చేసిన ప్రోటోకాల్, భద్రతా మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా చిన్నపాటి లోపం కూడా తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.మంత్రి వంగలపూడి అనిత ముందుగా వి-కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమ వేదికను పరిశీలించారు. అనంతరం గ్రీన్ రూములు, అతిథుల విశ్రాంతి గదులు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, ఇతర సౌకర్యాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రపతి పర్యటనతో పాటు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు లతామాధురి, మణికంఠ, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్స్ మా అంబాసిడర్లు

మొదటి పేజీ తరువాయి...

ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థుల కష్టమే ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చిందని, ప్రైవేట్ పాఠశాలల నుంచి 1.06 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో చేరడం ఈ మార్పునకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. విద్యాశాఖను వ్యవసాయంతో పోల్చిన మంత్రి.. దీని ఫలితాలు వెంటనే రావని, నిరంతర కృషి అవసరమని చెప్పారు. విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కింద లీప్ యాప్‌ను ప్రారంభించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విజయాలను సెలబ్రేట్ చేస్తూ, పత్రికల్లో వారి ఫోటోలతో ప్రకటనలు ఇచ్చి గౌరవించుకున్నామన్నారు. పాఠశాలల్లో రాజకీయాలకు తావులేకుండా టెక్స్ట్‌బుక్స్, బ్యాగులు, గుడ్లపై ఎవరి ఫోటోలు లేకుండా చేశామని.. ప్రభుత్వ స్కూళ్లలో త్వరలోనే 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టే పరిస్థితి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.
మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని.. 10 వేల పాఠశాలల్లో 'వన్ క్లాస్ వన్ టీచర్' విధానాన్ని తీసుకొచ్చామన్నారు. డొక్కా సీతమ్మ' మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఫైన్ రైస్, మిల్లెట్ చిక్కీలు అందిస్తున్నామని.. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ సంస్కరణల ఫలితంగానే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత గత ఏడాది 72.8శాతం నుండి ఈసారి 78.39శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. సమాజంలో నైతిక విలువలు, మహిళలను గౌరవించడం చాలా ముఖ్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఇందుకోసమే చాగంటి కోటేశ్వరరావును విలువ ఆధారిత విద్యకు సలహాదారుగా నియమించినట్లు చెప్పారు. అమ్మకు చెప్పలేని ఏ పనీ చేయకూడదు అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఆత్మహత్యల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని, ఫెయిల్ అంటే నేర్చుకోవడంలో మొదటి ప్రయత్నం అని మంత్రి హితబోధ చేశారు. 2019లో తాను మంగళగిరిలో ఓడిపోయినప్పుడు బాధపడ్డానని.. కానీ ఐదేళ్లు కష్టపడి ఈరోజు 91 వేల మెజారిటీతో గెలిచానన్నారు. తన జీవితమే మీకు ఒక ఉదాహరణ అని స్ఫూర్తి నింపారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై ఏడాదికి లక్ష రూపాయలు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో తాము చదివిన స్కూళ్లకు సహాయం చేయాలని కోరారు.

## మూడు భాషల సూత్రానికి మినహాయింపు

### తాత్కాలికంగా ఆ నియమానికి సడలింపు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ప్రస్తుత విద్యాసంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పెద్ద ఉపశమనం కలిగించింది. జాతీయ విద్యా విధానం 2020 కింద ప్రతిపాదించిన మూడు భాషల సూత్రాన్ని అమలు చేయడంలో ఒకేసారి మినహాయింపు ఇస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. పరివర్తన కాలంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ తాత్కాలిక సడలింపులు ఇచ్చినట్లు బోర్డు స్పష్టం చేసింది. ఈ కొత్త మార్గదర్శకాల ప్రకారం, రెండు నాన్-నేటివ్ భాషలను (ఉదాహరణకు ఇంగ్లీష్, ఫ్రెంచ్) ఎంచుకున్న 9వ తరగతి విద్యార్థులు అదే కాంబినేషన్‌ను కొనసాగించవచ్చు. అయితే, వారు మూడవ భాషగా ఒక భారతీయ భాషను అదనంగా నేర్చుకోవాల్సి ఉంటుంది. "ఈ మార్పుల వల్ల ఏ విద్యార్థి కూడా నష్టపోకూడదు" అని బోర్డు స్పష్టం చేసింది. ఈ అదనపు మూడవ భాషకు స్కూల్ స్థాయిలోనే అంతర్గత మూల్యాంకనం ఉంటుంది తప్ప, ఈ బ్యాచ్ విద్యార్థులు 2027-28లో 10వ తరగతికి వెళ్లినప్పుడు ఎలాంటి సీబీఎస్ఈ బోర్డు పరీక్ష రాయాల్సిన అవసరం లేదు.

**వివాదాస్పద సర్క్యులర్ - నేపథ్యం**

అంతకుముందు మే 15న సీబీఎస్ఈ ఒక సర్క్యులర్ జారీ చేస్తూ, అనుబంధ పాఠశాలలన్నీ జూలై 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు మూడు భాషలను తప్పనిసరి చేయాలని ఆదేశించింది. ఇందులో కనీసం రెండు భారతీయ భాషలు ఉండాలని స్పష్టం చేసింది. అయితే ఎన్‌సీఈఆర్‌టీ ప్రత్యేక పాఠ్యపుస్తకాలను విడుదల చేసే వరకు ఈ విధానాన్ని నిలిపివేయాలని డిసెంబర్ 2025లో సీబీఎస్ఈ గవర్నింగ్ బాడీ తీసుకున్న నిర్ణయానికి ఈ సర్క్యులర్ విరుద్ధంగా ఉందంటూ విమర్శలు వచ్చాయి. విద్యాసంవత్సరం మధ్యలో ఇలాంటి నిర్ణయాల వల్ల పాఠశాలల నిర్వహణ, విద్యా ప్రణాళికలు దెబ్బతింటాయని ప్రిన్సిపాల్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే బోర్డు తాజా సడలింపులు ఇచ్చింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 7, 8 తరగతుల్లో ఉంటూ రెండు నాన్-నేటివ్ భాషలు చదువుతున్న విద్యార్థులకు కూడా ఇదే సడలింపు వర్తిస్తుంది. వారు కూడా ఒక భారతీయ భాషను మూడవ భాషగా జోడించుకోవాలి. దీనికి కేవలం అంతర్గత పరీక్షలే ఉంటాయి తప్ప 10వ తరగతి బోర్డు పరీక్ష ఉండదు. మరోవైపు, ప్రస్తుత 10వ తరగతి (2026-27) బ్యాచ్ విద్యార్థులకు ఎటువంటి మార్పులు లేవు. వారు పాత రెండు భాషల విధానంలోనే కొనసాగుతారు. వీరు మూడవ భాషను చదవాల్సిన అవసరం లేదు. అయితే, 2026-27 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులకు, ఆ తర్వాతి బ్యాచ్‌లకు ఈ మూడు భాషల విధానం పూర్తిగా వర్తిస్తుంది. వారు తప్పనిసరిగా రెండు భారతీయ భాషలను చదవాలి. ఈ బ్యాచ్‌లు 10వ తరగతికి వచ్చేసరికి మూడవ భాష కు కూడా బోర్డు పరీక్ష రాయాల్సి ఉంటుంది. దీనికోసమే 22 భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## వాయిస్ మెసేజ్‌తో ఫిర్యాదు చేయవచ్చు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం మరో కొత్త ఫీచర్ ప్రవేశపెట్టింది. ఇక నుంచి ప్రభుత్వ సేవలపై వాయిస్ మెస్సేజ్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించనుంది. ఈ మేరకు అధికారులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వ ఆఫీసులు, అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేదు. వాట్సప్ ద్వారా సులువుగా ఫిర్యాదు చేయవచ్చు. వాయిస్ మెస్సేజ్ రూపంలో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించనున్నారు. త్వరలోనే ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి సోమవారం ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు అన్ని జిల్లాల కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాల్లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక నుంచి మీరు గ్రీవెన్స్ సెల్ వరకు వెళ్లాల్సిన అవసరం లేదు. వాట్సప్ ద్వారా సులభంగా మీ సమస్యను వివరించవచ్చు. ఈ మేరకు కొత్త వ్యవస్థపై ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. వీలైనంత త్వరగా ఈ సదుపాయాన్ని అమల్లోకి తీసుకురావాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. దీని వల్ల ప్రజలు సమయం, డబ్బులు ఆదా కానున్నాయి. తాజాగా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి ప్రభుత్వ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు సులువుగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. వాయిస్ మెస్సేజ్‌ల ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాలని, వీటిన కూడా స్వీకరించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఇక రాష్ట్రంలో మొబైల్ నెట్ వర్క్ కనెక్టివిటీ సమస్యలు రాకుండా చూడాలని, అన్ని ప్రాంతాల్లో మెరుగైన నెట్ వర్క్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 వేల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్య ఉందని, మూడు నెలల్లోగా ఆక్కడ పరిస్థితిని మెరుగుపర్చాలని చంద్రబాబు అన్నారు.

## లొంగిపోయిన హెడ్ కానిస్టేబుల్స్

మొదటి పేజీ తరువాయి...

లొంగిపోయారు. సాయికృష్ణ మృతి వెనుక వీరు సీఐ నాగరాజుకు పూర్తిస్థాయిలో సహకరించినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం నిర్ధారించింది. సిట్ విచారణలో లొంగిపోయిన ఈ ఇద్దరు పోలీసుల విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని అసాంఘిక కార్యకలాపాలకు వీరే సూత్రధారులని తేలింది. హెడ్ కానిస్టేబుల్ అశోక్ స్టేషన్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాలు, లాడ్జీలు.. ఇతర విషయాలను చూసుకునేవాడు. అంతేకాకుండా.. సివిల్ సెటిల్‌మెంట్లు చేస్తూ పెద్ద ఎత్తున అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. హెడ్ కానిస్టేబుల్ నాని రౌడీషీటర్లు, పాత నేరస్థులతో ముఠాగా ఏర్పడి బెదిరింపులకు పాల్పడేవాడు. గతంలో పటమట స్టేషన్‌లో ఉన్నప్పుడు స్పా సెంటర్ల నిర్వాహకులను వేధించడంతో ఇతడిని వీఆర్‌కు పంపారని తెలుస్తోంది. గన్నవరంలో పనిచేసినప్పుడు ఓ మిస్సింగ్ కేసులో తానే ఎస్సైని అంటూ డబ్బులు వసూలు చేసి సస్పెండ్ కూడా అయ్యాడు. పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ల కౌన్సెలింగ్, నిందితుల విచారణ వంటి అధికారిక వ్యవహారాల్లో సురేష్ అనే ప్రైవేట్ వ్యక్తిని కూడా వీరు భాగస్వామిని చేసినట్లు సిట్ గుర్తించింది. గత నెల 29న సాయికృష్ణ బంధువులను బెదిరించేందుకు లేదా ప్రభావితం చేసేందుకు అశోక్, నాని, సురేష్ కలిసి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి వెళ్లినట్లు ఆధారాలు లభించాయి. ఇప్పటికే ప్రైవేట్ వ్యక్తి సురేష్‌ను అదుపులోకి తీసుకున్న సిట్ అధికారులు, ఇప్పుడు లొంగిపోయిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. ఈ లొంగుబాటుతో సాయికృష్ణ మృతి వెనుక ఉన్న మరిన్ని అసలు నిజాలు, నగరంలో పోలీసుల అండతో సాగిన మరికొన్ని అక్రమ దందాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

## ఏపీ-ఫస్ట్..!

మొదటి పేజీ తరువాయి...

సంస్థగా దీనిని స్థాపించినట్లు పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే వెల్లడించారు. ఈ నూతన సంస్థ భవిష్యత్తుకు అవసరమైన పలు కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీస్, హెల్త్‌కేర్ అండ్ బయోటెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, గ్రామీణ వ్యవసాయ సాంకేతికతలు, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌పై ఫోకస్ చేయనుంది. రాష్ట్రంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రతిష్టాత్మక విద్యాసంస్థల మౌలిక సదుపాయాలను ఈ సంస్థ ఉపయోగించుకోనుంది. ఐఐటీ తిరుపతి, ఐఐఎస్ఈఆర్ తిరుపతిలతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ యూనివర్సిటీలలో అందుబాటులో ఉన్న వసతుల ఆధారంగా ఈ కంపెనీ కార్యకలాపాలు సాగిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ప్రారంభానికి ప్రభుత్వం రూ. 5 కోట్ల సీడ్ క్యాపిటల్ కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.1 లక్ష కోట్ల 'రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫండ్' వంటి పథకాలతో అనుసంధానమై, నిధుల సమీకరణలో స్వయం సమృద్ధి సాధించడమే 'ఏపీ-ఫస్ట్' ప్రధాన లక్ష్యం. పరిశోధనా సంస్థలు, పరిశ్రమల భాగస్వాములు, స్టార్టప్‌లు, ప్రభుత్వ శాఖలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా ఒక సమగ్ర ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించడమే దీని ముఖ్య ఉద్దేశం. ప్రైవేట్, ప్రభుత్వ రంగానికి చెందిన పరిశోధనలను సమన్వయం చేస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయి హబ్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో కలిసి దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు కాంతిలాల్ దండే స్పష్టం చేశారు.



## విశాఖలో సీఐఐ సమ్మిట్

మొదటి పేజీ తరువాయి...

సెప్టెంబర్ వరకు దేశ, విదేశాల్లో రోడ్ షోలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ నగరాల్లో ఈ ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు కీలక సూచనలు చేశారు. పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో కేవలం పెట్టుబడులు, వ్యాపార అవకాశాలకే పరిమితం కాకుండా ప్రజా విధానాలు, సాంకేతికత, వ్యవసాయం, ఉద్యానవనం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, ఒత్తిడి లేని పని సంస్కృతి వంటి అంశాలపై కూడా విస్తృత చర్చలు జరగాలని సూచించారు. ప్రాంతీయ సమావేశాల్లోనూ ఎంఓయూలు కుదిరేలా చర్యలు తీసుకోవాలని, ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నిపుణులను సదస్సుకు ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎన్ని పెట్టుబడులు వచ్చాయన్నదానికంటే నాలెడ్జ్ షేరింగ్ ఎంత జరిగిందన్నదే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. అదేవిధంగా, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

## నిష్పక్షపాత, కాల పరిమితి విచారణ

మొదటి పేజీ తరువాయి...

ఆరోపిత చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ నేతృత్వంలోని బహుళ-విభాగాల ప్రత్యేక దర్యాప్తు బృందం చేత విచారణ జరిపించాలని న్యాయవాదులు అజయ్ కుమార్ రాయ్, దినేష్ కుమార్ యాదవ్ తమ పిటిషన్‌లో కోరారు. కోట్లాది మంది భక్తులు, దాతల విశ్వాసాన్ని నిలబెట్టడానికి, ప్రజా ప్రయోజనాలను పరిరక్షించడానికి అవసరమైన నియంత్రణ, పర్యవేక్షణ, ఆడిట్ యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి, ఆలయ ట్రస్టుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. "శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించిన నిధుల దుర్వినియోగం, ఇతర అవకతవకలపై వచ్చిన నివేదికలు నిజమా కాదా అనేది పక్కనబెడితే.. అయోధ్య వైభవ వారసత్వ పునరుద్ధరణ కోసం సుదీర్ఘ పోరాటం చేసిన తరాలలో ఈ వార్తలు తీవ్ర ఆందోళనను రేకెత్తించాయి" అని పిటిషన్‌లో పేర్కొన్నారు. రామ మందిరానికి సమర్పించిన కానుకల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో, ఆలయ ట్రస్ట్ అభ్యర్థన మేరకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఎస్ఐటీలో లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఎస్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి నీల్ రతన్ సభ్యులుగా ఉన్నారు. అయితే, ఈ సిట్ ఎటువంటి ఎఫ్ఐఆర్ గానీ, సాధారణ క్రిమినల్ కేసు గానీ నమోదు చేయకుండానే దర్యాప్తు ప్రారంభించిందని పిటిషనర్లు ఆరోపించారు. కేవలం పరిపాలనా అధికారులతో కూడిన దర్యాప్తు కంటే, సంక్లిష్టమైన ఆర్థిక, నేర కేసులను దర్యాప్తు చేసే నైపుణ్యం, వనరులు, సంస్థాగత నిర్మాణం కలిగిన సీబీఐ ద్వారా స్వతంత్ర విచారణ జరిపితేనే ప్రజల్లో ఎక్కువ విశ్వాసం ఉంటుందని పిటిషన్‌లో స్పష్టం చేశారు.

## వారి తరుఫున కేసు వాదించం

### అయోధ్య ట్రస్టుచోరీ నిందితులకు షాక్

### యూపీ న్యాయవాదుల సంఘం ఏకగ్రీవ సంచలన ప్రకటన

అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల దుర్వినియోగం , చోరీ ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న వేళ.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన న్యాయవాధుల సంఘం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. రామాలయానికి భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాల చోరీ కేసులో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసింది. అయితే, ఈ నిందితుల తరఫున ఫైజాబాద్ బార్ అసోసియేషన్‌కు చెందిన ఏ ఒక్క లాయర్ కూడా కోర్టులో వకాలత్ పుచ్చుకోకూడదని, వారి తరఫున వాదించకూడదని బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమవారం జరిగిన బార్ అసోసియేషన్ జనరల్ బాడీ అత్యవసర సమావేశంలో ఈ మేరకు సంచలన నిర్ణయం తీసుకున్నారు. అసోసియేషన్ తీసుకున్న ఈ సామూహిక నిర్ణయాన్ని ఎవరైనా న్యాయవాది అతిక్రమించి, నిందితులకు లీగల్ సపోర్ట్ ఇస్తే.. సదరు లాయర్‌కు రూ.5 లక్షల భారీ పెనాల్టీ విధిస్తామని అసోసియేషన్ ప్రెసిడెంట్ కాళికా ప్రసాద్ మిశ్రా స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన అధికారికంగా చేసిన ప్రకటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దేవుడికి సమర్పించిన కానుకలను దొంగిలించడం ద్వారా నిందితులు కోట్లాది మంది హిందువుల, భక్తుల సెంటిమెంట్లను తీవ్రంగా గాయపరిచారని, అందుకే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని బార్ అసోసియేషన్ సెక్రటరీ శైలేంద్ర జైస్వాల్ వెల్లడించారు. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో 2005 లో అయోధ్యలోని తాత్కాలిక రామాలయంపై ఉగ్రవాదులు దాడి చేసిన సమయంలోనూ.. సదరు ఉగ్రవాదుల తరఫున స్థానిక లాయర్లు ఎవరూ కోర్టులో వాదించకూడదని బార్ అసోసియేషన్ అప్పట్లోనే చారిత్రాత్మక తీర్మానం చేసింది.

ఈ సాధారణ సర్వసభ్య సమావేశంలో న్యాయవాదులు కేవలం నిందితులను దూరం పెట్టడమే కాకుండా.. ఈ వివాదంతో సంబంధం ఉందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, మాజీ ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా, అకౌంట్స్ ఆఫీసర్ గోపాల్ రావులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరు ముగ్గురూ రాబోయే మూడు రోజుల్లోగా అయోధ్య నగరాన్ని విడిచి వెళ్లాలని, లేనిపక్షంలో అయోధ్య నగరాన్ని పూర్తిగా స్తంభింపజేస్తామని న్యాయవాదుల సంఘం అల్టిమేటం జారీ చేసింది. కాగా, ఈ వివాదం ముదరడంతో చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు ఇప్పటికే తమ ట్రస్ట్ పదవుల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు.

ఈ విరాళాల కుంభకోణంపై ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ పోలీసులు ఏర్పాటు చేసిన సెట్ లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఇప్పటికే అరెస్ట్ అయిన ఎనిమిది మంది నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి, వారి ఆస్తుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ కేసు తీవ్రతను బట్టి దీనిపై కేవలం స్థానిక పోలీసుల దర్యాప్తు సరిపోదని.. కోర్టు ద్వారా సెక్షన్ 156(3) కింద చంపత్ రాయ్, ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ కి ఈ కేసును అప్పగించేలా చట్టపరంగా పోరాడతామని బార్ అసోసియేషన్ స్పష్టం చేసింది.

# ఆగస్ట్ 24,25 చైనాలో 10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు

### ఆగష్టు 24, 25 తేదీల్లో షాంగై నగర వేదికగా అంతర్జాతీయ సాహితీ వేడుక

### - సదస్సుకు హాజరయ్యేందుకు నమోదు కార్యక్రమం

### పద్మభూషణ్ డాక్టర్. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

**విశాఖపట్నం, జూన్ 29, జయ జయహే :**

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, షాంఘై తెలుగు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు చైనా దేశంలోని షాంఘై మహానగరంలో వచ్చే ఆగస్టు 24, 25 తేదీల్లో నిర్వహించబడుతుందని సదస్సు నిర్వహణ సంస్థల సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు లోక్ నాయక్ ఫౌండేషన్ అధ్యక్షులు పద్మభూషణ్ డాక్టర్. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఏయూ హిందీ విభాగం భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా చైనా దేశంలో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సాహితీ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషా, సాహిత్యాభిమానులు ఆహ్వానితులేనన్నారు. తనతో పాటు వంశీ రామరాజు ఒక సలహాదారుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, చైనాలోని ఇతర తెలుగు సంస్థలతో పాటు సారధి



(సింగపూర్), వంశీ ఆర్ట్స్ ఇంటర్ నేషనల్ (హైదరాబాద్) సహకారంతో, లోక్ నాయక్ ఫౌండేషన్ (విశాఖపట్నం) సౌజన్యంతో ఈ ప్రతిష్టాత్మక సదస్సు జరుగుతుందన్నారు. 2007లో హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ ప్రపంచ స్థాయి సాహితీ సదస్సుల పరంపర ఇప్పటివరకు 5 ఖండాల్లో విజయవంతంగా జరిగిందన్నారు. చైనాలో నివసిస్తున్న తెలుగు రచయితలు, పండితులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు ప్రత్యక్షంగా కలుసుకుని స్వీయ రచనలు, సాహిత్య ప్రసంగాలు పంచుకునే వేదిక కల్పించడం ప్రధాన ఉద్దేశమన్నారు. భారతదేశంతో పాటు సింగపూర్, మలేషియా, న్యూజీలాండ్ నుంచి అమెరికా వరకు విశ్వవిద్యా వేత్తలైన, సాహితీవేత్తలను ఆహ్వానించి స్థానికులకు సాహిత్య ప్రసంగాలు వినే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పుస్తకావిష్కరణలు, పుస్తక విక్రయశాల, చర్చా వేదికలు, జీవన సాఫల్య పురస్కారాలు వంటి ఆకర్షణలు ఉంటాయన్నారు. భారతదేశం నుంచి సాహిత్య, కళా, రాజకీయ రంగాల ప్రముఖులు సదస్సుకు విచ్చేస్తారని,వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ సదస్సుకు చైనాకు రావడానికి ప్రాథమిక నమోదు కోసం వివరిస్తూ చైనాలో తొలిసారిగా జరుగుతున్న ఈ చారిత్రక సదస్సులో ప్రత్యక్షంగా పాల్గొనదలచినవారు గూగుల్ ఫామ్ ద్వారా ప్రాథమిక ఆసక్తిని తెలియజేయాలన్నారు. ప్రపంచంలో ఏ దేశం నుంచి అయినా తమ సొంత ఖర్చులతో షాంఘై వచ్చి సదస్సులో పాల్గొనే ప్రతినిధులకు, వక్తలకు ఉచితంగా స్థానిక వసతి, ఆతిథ్యం కల్పించడం జరుగుతుందన్నారు. చైనా వీసా, విమాన ప్రయాణ ఏర్పాట్లు మాత్రం ప్రతినిధులే చేసుకోవాలన్నారు. దీనికి నిర్వాహక కమిటీ బాధ్యత వహించదన్నారు. భారత ప్రతినిధులకు ప్రత్యేక సూచన చేస్తూ వీసా, టికెట్ వివరాలకు అనుభవజ్ఞులైన ట్రావెల్ ఏజెంట్ ఖాజా( హైదరాబాద్ ) o91 9393270293 ఫోన్ నెంబర్ను సంప్రదించవచ్చునన్నారు. మిగతా సంప్రదింపుల కోసం కార్యక్రమ కార్యవర్గ నిర్వాహకులు కొలన్ మాధవ రెడ్డి o91 8886027778, వంగూరి చిట్టెన్ రాజు o1 832 594 9054, శాయి రాచకొండ o1 281 235 6641, చిరునామాలకు సంప్రదించాలని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కోరారు.




## రైతు ఇంట సిరులు పండాలి...!

### ఏరువాక కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, జూన్ 29, జయ జయహే**

రైతులు వ్యవసాయంలో అధికోత్పత్తి సాధించి, వారి కుటుంబాల్లో సిరిసంపదలు, ఆనందాలు వెల్లివిరియాలని భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నైరుతి ఋతుపవనాల రాకకు సూచికగా వ్యవసాయ కార్యకలాపాలకు శ్రీకారం చుడుతూ జ్యేష్ఠ పౌర్ణిమ సందర్భంగా సోమవారం ఉదయం పద్మనాభం మండలం మద్ది గ్రామంలో నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నాగలి పట్టి పొలం దున్ని సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తోందన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధి, కుటుంబ సంక్షేమం, ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రైతులు అధిక ఆదాయం పొందేందుకు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్‌తో పాటు ఇతర ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న బిందు, తుంపర సేద్య పరికరాలు, రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడంతో పాటు భూసారాన్ని పరిరక్షించేందుకు, పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, ఉద్యానశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



### దైవ దర్శనానికి వెళుతూ...

## అనంత లోకాలకు...!

### భర్త ముందే భార్య మృతి

**నక్కపల్లి, జూన్ 29, జయ జయహే :**

అనకాపల్లి జిల్లాలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది, ఎంతో భక్తి శ్రద్ధలతో దైవదర్శనానికి వెళుతున్న భార్యాభర్తలు ప్రమాదంలో చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో భార్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా భర్త మృత్యువుతో పోరాడుతున్నారు, అసలే వర్షాకాలం వరస ప్రమాదాలకు వేదికగా జాతీయ రహదారులు నిలిచిన పరిస్థితులు నెలకొన్న తరుణంలో మరో ప్రమాదం జరిగింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయంపూడి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం సంభవించింది, విశాఖ జిల్లా పెందుర్తి ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దర్శనానికై ప్రయాణమయ్యారు, సరిగ్గా అనకాపల్లి నుంచి కాకినాడ జిల్లాలోకి ప్రవేశించే ముందు న్యాయంపూడి జాతీయ రహదారిపై భార్యభర్తలు వెళుతున్న వాహనాన్ని ఐషర్ వ్యాన్ బలంగా వెనకనుంచి ఢీకొట్టింది, ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న భార్య వ్యాన్ ముందు భాగానికి అతుక్కుపోయి ప్రాణాలు విడిచింది, మరొపక్క భర్త ఇదే వాహనంతో ఎదురుగా వెళ్తున్న వ్యాన్‌ని ఢీ కొట్టారు, దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. కళ్ల ముందే తన భార్య విగత జీవిగా మారిపోవడంతో తీవ్ర గాయాలతోనే ఆయన రోధించే ఘటన అందరినీ కలచి వేసింది, ఏదేమైనా ఆధ్యాత్మికంగా ఎంతో ప్రశాంతంగా సన్నిధానానికి వెళ్తున్న దంపతులకు ఎదురైన అనుకోని ప్రమాదం వారిద్దరిని విడదీసిందని స్తానికులు చెప్పుకుంటున్నారు. ఘటన ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు. నక్కపల్లి సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## నిజనిర్ధారణ కమిటీపై కూటమి దాడి దారుణం

### - ప్రజల సమస్యలు తెలుసుకోవడం కూడా తప్పేనా

### - ప్రజా స్వామ్యంపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారు

### - వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బీఎస్ కృష్ణ ( ఆల్ఫా కృష్ణ )

**విశాఖపట్నం, జూన్ 29, జయ జయహే**

అమరావతి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన నిజ నిర్ధారణ కమిటీపై కూటమి నేతలు దాడి ప్రజాస్వామ్యంపై దాడేనని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బి.ఎస్.కృష్ణ (ఆల్ఫా కృష్ణ) అన్నారు. సోమవారం మద్దిలపాలెం కృష్ణ కాలేజి రోడ్డులో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లుడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డిని అమరావతి ప్రాంతానికి చెందిన రైతులు కలిసి తమ సమస్యలను వివరించారని, ప్రభుత్వం తమ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకుంటోందని, ప్రశ్నిస్తే బెదిరింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. రైతుల ఆవేదనను విన్న జగన్ ఆ ఆరోపణల్లో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసి అమరావతి ప్రాంతానికి పంపిస్తే ఆ కమిటీపై తాడేపల్లి ప్రాంతంలో కర్రలు, రాళ్లతో దాడి జరిగిన ఘటన తీవ్రంగా ఖండించదగ్గదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు ఉందని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కును హింసతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అమరావతి ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు... అది ఎవరి జాగీరు కాదు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అంతర్భాగమైన అమరావతికి వెళ్లే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి ప్రజాప్రతినిధికి, ప్రతి పౌరుడికి ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లే ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం, వారిపై దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమని, అయితే అధికార పక్షం తీసుకునే నిర్ణయాలను ప్రతిపక్షం ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగమేనని గుర్తెరగాలన్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో సాయికృష్ణ అనే యువకుడు మరణించిన ఘటనపై కూడా ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని, ఆ ఘటనపై కూడా పూర్తి స్థాయి, స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.



## వాడబలిజ కుటుంబానికి అండగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

### - దహన ఖర్చులకు రూ. 10 వేల సాయం

**విశాఖపట్నం, జూన్ 29, జయ జయహే :**

దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మరోసారి తన దాతృత్వం చాటుకున్నారు. 34వ వార్డు అచ్చియమ్మ పేట వాడబలిజ వర్గానికి చెందిన పిరీపిల్లి అప్పారావు భార్య పిరిపిల్లి యర్రమ్మ దహన ఖర్చులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిందని వార్డు స్థానిక నేతలు ద్వారా తెలుసుకొని బాధితుల ఇంటికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారిలో ధైర్యం నింపారు. ఇంటి దీపం ఆరిపోవడం అంటే ఎవరు ఆ లోటు పూడ్చలేనిది అన్నారు. ఎటువంటి సహాయానికైనా తాను అందుబాటులో ఉంటానని అధైర్య పడకుండా జీవితాన్ని ముందుకు సాగించాలని కుటుంబ సభ్యులను ఓదార్చరు. బాధితుడు అప్పారావు మాట్లాడుతూ పిలిచిన వెంటనే పలికే ఒకే ఒక్క నాయకుడు వాసుపల్లి గణేష్ కుమార్ అని కొనియాడారు. తమ కులానికి చెందిన వాసుపల్లి గణేష్ కుమార్ దక్షిణ నియోజకవర్గ పేదల బంధువుగా అందర్నీ ఆదుకోవడం గర్వకారణం అన్నారు.



## ముస్సోరీ పోలీసులతో సమన్వయం చేస్తాం...!

### బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హోం మంత్రి హామీ

**విశాఖపట్నం, జూన్ 29, జయ జయహే :**

టెకీ రాధా గాయత్రి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీనిచ్చారు. విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విశాఖపట్నానికి చెందిన 27 ఏళ్ల టెకీ రాధ గాయత్రి తల్లిదండ్రులు పి. సుధాకర్, సత్యవతి దంపతులు సోమవారం హోంమంత్రి వంగలపూడి అనితను కలిశారు. తమ కుమార్తె అనుమానాస్పద మృతి కేసులో ముస్సోరీ పోలీస్ విచారణాధికారితో సమన్వయం సాధించేందుకు హోం మంత్రి జోక్యం చేసుకుని సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన హోం మంత్రి, సౌత్ జోన్ డీసీపీ మేరీ ప్రశాంతి, విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి, ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని సంబంధిత అధికారులతో సమర్థవంతమైన సమన్వయం కల్పించాలని ఆదేశించారు. అలాగే, పోస్ట్‌మార్టం నివేదిక మరియు ఇతర దర్యాప్తు ప్రక్రియలను వేగవంతం చేయడానికి అధికారిక లేఖ పంపబడుతుందని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, బాధిత కుటుంబానికి పూర్తి స్థాయి న్యాయ సహాయం అందించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అండగా నిలుస్తుందని, న్యాయం సాధించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ముస్సోరీ లోని ఉత్తరాఖండ్ హోం విభాగంతో సమన్వయం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# నేడు గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం

### - హాజరు కానున్న భారత రాష్ట్రపతి ముర్ము, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

### - 373 మందికి డిగ్రీ పట్టాలు.. 13 మందికి బంగారు పతకాల ప్రధానం

### - ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ టి. శ్రీనివాసన్

**విశాఖపట్నం, జూన్ 29, జయ జయహే**

: విశాఖపట్నంలో మంగళవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం (కాన్వొకేషన్) ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం స్థానిక దస్పల్లా హోటల్లో సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2020 నుంచి 2025-26 విద్యా సంవత్సరాల వరకు వివిధ కోర్సులు పూర్తి చేసిన మొత్తం 373 మంది విద్యార్థులకు డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం కేంద్రంగా 2019లో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటై, 2020 నుంచి తరగతులు ప్రారంభమైనట్లు వివరించారు.



ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఎనిమిది పీజీ కోర్సులు, ఐదు డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. స్నాతకోత్సవంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ నుంచి 200 మంది, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ నుంచి 82 మంది, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి 91 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నట్లు వెల్లడించారు.

**13 మందిలో 11 మంది విద్యార్థినులే**

ఈ సందర్భంగా ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విశిష్ట ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారిలో 11 మంది విద్యార్థినులు, ఇద్దరు విద్యార్థులు ఉండటం విశేషమన్నారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ విభాగం నుంచి ఐదుగురు, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కెమిస్ట్రీ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఇద్దరు, ఎంఎస్సీ బయోటెక్నాలజీ నుంచి ఇద్దరు బంగారు పతకాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఛాన్సలర్ మదన్ లాల్ మీనా మాట్లాడుతూ స్నాతకోత్సవం ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. ఉన్నత విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నవీన ఆలోచనలను అలవరచుకున్నప్పుడే యువత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదన్నారు. పట్టభద్రులు తమ విద్యను దేశాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఫౌండర్ వీసీ టి.వి. కట్టిమణి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ విద్యావేత్తలు, విశిష్ట అతిథులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు నిర్ణీత సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జితేంద్ర మోహన్ మిశ్రా పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే



# టిడిపిలో కార్యకర్తలకే అగ్రతాంబూలం

శ్రీకాళహస్తి.(జయ జయహే )

బడుగు బలహీన వర్గాల సంక్షేమం మరియు అభివృద్ధిని కాంక్షిస్తూ, నాలుగు దశాబ్దాల క్రితం స్వర్గీయ నందమూరి తారక రామారావు చేతుల మీదుగా పురుడు పోసుకున్న తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకే అగ్రతాంబూలం అని శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు.తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జూలై ఒకటో తారీఖున శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమవ్వడానికి శ్రీకాళహస్తి నియోజకవర్గానికి విచ్చేస్తున్నారని,దీనిలో భాగంగా రేణిగుంట వద్ద ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పరిశీలించడానికి సోమవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ ముఖ్య నాయకులు వేదిక వద్దకు రావడం జరిగింది.గత వైసిపి దురాగతాలను ఎదురొడ్డి పోరాడిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులను కలిసి, వివిధ రాజకీయ మరియు సామాజిక అంశాలను కార్యకర్తలతో పంచుకొని, రాబోయే రోజులలో అటు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో, ఇటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఏవిధంగా ప్రజలలోకి వెళ్ళాలనే దానిపై కార్యకర్తలకు మార్గనిర్దేశం చేయడానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తో కలిసి వేదిక పంచుకోబోతున్న నారా లోకేష్ సమావేశాన్ని సమర్ధవంతంగా నిర్వహించుకోవడానికి సుధీర్ రెడ్డి నాయకత్వంలో ప్రతీ ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డా.జి.దశరథాచారి, యం.సుబ్బయ్య, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారం కంటే విలువైన తాంత్రిక మూలిక...!!

## నల్ల పసుపు" (కాళీ హల్దీ)

(పుట్టా శ్రీనివాసరావు)

**సహజంగా మన ఇళ్లలో ఉపయోగించే పసుపు పచ్చ రంగులో ఉంటుంది. కానీ ప్రకృతే ప్రసాదించిన అరుదైన వనమూలికలలో "నల్ల పసుపు" (కాళీ హల్దీ) జ్యోతిష్యులు, తాంత్రిక నిపుణులు దీనిని కేవలం ఒక వేరుగా చూడరు; సంపదను ఆకర్షించడానికి,రక్షణ పొందడానికి ఇది ఒక శక్తివంతమైన సాధనంగా భావిస్తారు. అందుకే కొందరి దృష్టిలో ఇది బంగారం కంటే కూడా అత్యంత విలువైనది.**

**జ్యోతిష్యశాస్త్రం జానపద నమ్మకాల ప్రకారం నల్ల పసుపును సూచించడానికి గల 7 ముఖ్య కారణాలు, దాని ప్రయోజనాలు ఉపయోగించే విధానం ఒకసారి పరిశీలిద్దాం..**

### శని రాహు గ్రహ దోషాల నివారణ

జ్యోతిష్యంలో శని, రాహువులను క్రూర గ్రహాలుగా భావిస్తారు. ఈ రెండు గ్రహాలకు అత్యంత ప్రీతిపాత్రమైన రంగు "నలుపు". నల్ల పసుపు సహజంగానే ముదురు రంగు లేదా నలుపు రంగును కలిగి ఉండటం వల్ల, ఇది ఈ రెండు గ్రహాల శక్తిని సమతుల్యం చేస్తుందని నమ్ముతారు.

ప్రయోజనం: తీవ్రమైన శని దోషం (ఏలినాటి శని, అర్థాష్టమ శని) లేదా రాహు మహాదశ వల్ల వ్యాపారంలో నష్టాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు ఈ వేరును ఉపయోగిస్తారు. ఒకే వస్తువుతో రెండు ప్రధాన గ్రహాల దోషాలను శాంతింపజేయడం దీని ప్రత్యేకత.

### ధన నిల్వలను పెంచే పరిహారం

నల్ల పసుపు ఒక చిన్న ముక్కను తీసుకుని, దానికి గంధం, కుంకుమ రాసి, ఒక ఎర్రటి వస్త్రంలో చుట్టాలి. దీనిని మీరు డబ్బు దాచుకునే బీరువా, గల్లా పెట్టె లేదా నగలు ఉంచే చోట పెట్టాలి.

వ్యాపారస్తులకు ఇది బాగా కలిసి వస్తుందని




నమ్ముతారు. అనవసరపు ఖర్చులు తగ్గడానికి, కంటికి కనిపించని నష్టాల నుండి, ఇతరుల దిష్టి నుండి మీ సంపదను కాపాడటానికి ఇది సహాయపడుతుంది. సాధారణంగా దీనిని ప్రతి ఏటా దీపావళి పండుగ రోజున మారుస్తూ ఉంటారు.

### రక్షణ కవచం (తాయెత్తు) గా ధరించడం

నల్ల పసుపు ముక్కకు నల్లటి దారాన్ని కట్టి, దానిని చేతికి (మణికట్టుకు) లేదా మెడలో తాయెత్తులా ధరిస్తారు. ఇందువల్ల

సమాజంలో నెగటివ్ ఎనర్జీ, నరదిష్టి, చేతబడి వంటి శక్తుల ప్రభావం వల్ల కొందరి ఎదుగుదల అకస్మాత్తుగా ఆగిపోతుంది. అలాంటి సమయాల్లో ఇది ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. మనం సాధారణంగా కట్టుకునే నల్ల దారానికి, ఈ వనమూలిక శక్తి తోడవడం వల్ల దీని ప్రభావం రెట్టింపు అవుతుంది.

### శని, రాహు శాంతి పూజలు,హహోమాలు

పూజారులు శని లేదా రాహు గ్రహాల అనుగ్రహం కోసం ప్రత్యేకంగా హోమాలు (హవనం) చేసేటప్పుడు, హోమ ద్రవ్యాలలో (హవన సాగ్రి) ఈ నల్ల పసుపును కూడా కలుపుతారు. దీనితో పాటు నల్ల నువ్వులు, మినుములు, నల్లటి వస్త్రాన్ని కూడా సమర్పిస్తారు.ఇది పూజా సంకల్పాన్ని మరింత బలపరిచి, గ్రహ దోషాల తీవ్రతను వేగంగా తగ్గిస్తుందని నమ్ముతారు. అయితే, ఇది పురాతన శాస్త్రాలలో రాసి లేదు, కేవలం గురు-శిష్య పరంపరగా వస్తున్న సాంప్రదాయం మాత్రమే.

### సింహద్వారం (ప్రధాన ద్వారం) వద్ద రక్షణగా..

ఉపయోగించే విధానం: ఇంటి సింహద్వారం గడప దగ్గర దీనిని ఉంచడం లేదా తలుపు ముందర భూమిలో పూడ్చడం చేస్తారు. కొందరు దీనిని నిమ్మకాయ-మిరపకాయలు కట్టినట్లుగా గుమ్మానికి కడతారు.

ప్రయోజనం: ఇది ఇంటికి "జానపద వాస్తు" రక్షణను ఇస్తుంది. బయటి నుండి వచ్చే ఎలాంటి ప్రతికూల శక్తులు, ఈర్ష్యా ద్వేషాలు ఇళ్లలోకి ప్రవేశించకుండా ముందే అడ్డుకుంటుందని నమ్ముతారు.

### గురు దక్షిణ ఆశీర్వాదం

నల్ల పసుపుకు సంబంధించిన ఒక ముఖ్యమైన నియమం ఉంది. దీనిని మార్కెట్లో మనకు మనంగా డబ్బులిచ్చి కొనుక్కోవడం కంటే, ఎవరైనా సిద్ధులు, సాధువులు లేదా మన గురువుల చేతుల మీదుగా "ఆశీర్వాదం" రూపంలో తీసుకుంటేనే దానికి నిజమైన శక్తి వస్తుందని నమ్ముతారు.

కేవలం కొనుగోలు చేసిన వేరు సాధారణ వనమూలికలానే ఉంటుంది. కానీ గురువు ప్రసాదించినప్పుడు, అందులో వారి తపోశక్తి, ఆశీస్సులు తోడై అది ఒక దివ్యమైన వస్తువుగా మారుతుంది. అలాగే, దీనిని గురువులకు దక్షిణగా సమర్పించడం కూడా అత్యంత పుణ్యప్రదంగా భావిస్తారు.

### శుక్రవారపు ప్రత్యేక జల కక్రతువు

గురువారం రాత్రి లేదా శుక్రవారం రోజున నల్ల పసుపును కొద్దిగా నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం (శనివారం) ఆ నీటిని మీ నుదుటిపై తిలకంలా (బొట్టులా) పెట్టుకోవాలి లేదా మీ వ్యాపార స్థలంలో, నగదు డ్రాయర్‌పై చల్లుకోవాలి.

ఇందువల్ల శుక్రవారం సంపదకు అధిపతి అయిన శుక్రుడి రోజు. శని, రాహువులను శాంతింపజేసే ఈ వేరును శుక్రవారం నానబెట్టడం ద్వారా లక్ష్మీ దేవి అనుగ్రహం, శుక్రుని సౌఖ్యం కూడా లభిస్తాయని నమ్ముతారు.

# భారత్ ఎదుగుతోంది... కానీ ప్రతిభ ఎందుకు వెళ్తోంది?

(సి.హెచ్.ప్రతాప్)


ప్రపంచీకరణ యుగంలో ప్రతిభకు సరిహద్దులు లేవు. మెరుగైన విద్య, అధిక వేతనాలు, పరిశోధనా అవకాశాలు, జీవన ప్రమాణాల కోసం లక్షలాది మంది భారతీయ యువత అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాలకు వలస వెళ్తున్నారు. ఒకప్పుడు దీనిని "బ్రెయిన్ డ్రెయిన్"గా పరిగణించగా, నేడు అది "బ్రెయిన్ సర్క్యులేషన్"గా మారుతోందా అనే చర్చ కూడా జరుగుతోంది. అయినప్పటికీ దేశం అత్యుత్తమ మేధో సంపత్తిని కోల్పోతుందనే ఆందోళన మాత్రం కొనసాగుతోంది.

భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, అంతర్జాతీయ వలస నివేదికల ప్రకారం 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా 3.5 కోట్లకు పైగా భారతీయ మూలాల ప్రజలు విదేశాల్లో నివసిస్తున్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రవాస భారతీయ సమూహంగా నిలిచింది.

విద్యా రంగంలో ఈ ధోరణి మరింత స్పష్టంగా కనిపిస్తోంది. 2024లో సుమారు 7.6 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లారు. 2025లో ప్రపంచవ్యాప్తంగా విదేశీ విద్యాసంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 12 లక్షలకు పైగా నమోదైంది.

యువత విదేశాలకు వెళ్లడానికి ప్రధాన కారణాలు అనేకం. అభివృద్ధి చెందిన దేశాల్లో పరిశోధనలకు అధిక నిధులు, ఆధునిక మౌలిక సదుపాయాలు, ప్రతిభకు తగిన గుర్తింపు, అధిక వేతనాలు, మెరుగైన జీవన ప్రమాణాలు, పారదర్శక ఉద్యోగ వ్యవస్థలు యువతను ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, వైద్య రంగం, సెమీకండక్టర్లు వంటి రంగాల్లో ప్రపంచ స్థాయి అవకాశాలు విదేశాల్లో ఎక్కువగా లభిస్తున్నాయి. భారతదేశంలో ఉద్యోగాల కొరత కాకపోయినా, నైపుణ్యాలకు అనుగుణమైన అవకాశాల కొరత, పరిశోధనలో పరిమిత పెట్టుబడులు కూడా వలసలను ప్రోత్సహిస్తున్నాయి.

ఈ పరిస్థితి దేశ ఆర్థిక వ్యవస్థపై మిశ్రమ ప్రభావాన్ని చూపుతోంది. ఒకవైపు అత్యుత్తమ ప్రతిభ విదేశాలకు వెళ్లడం వల్ల పరిశోధన, ఆవిష్కరణలు, ఉన్నత సాంకేతిక రంగాల్లో



దేశం కొంత నష్టపోతుంది. వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు వంటి నిపుణుల కొరత ఏర్పడే అవకాశం ఉంటుంది. గత అధ్యయనాల ప్రకారం వేలాది మంది భారతీయ వైద్యులు, నర్సులు అభివృద్ధి చెందిన దేశాల్లో పనిచేస్తున్నారు.

అయితే మరోవైపు ప్రవాస భారతీయులు దేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన మద్దతు అందిస్తున్నారు. 2024లో భారతదేశానికి విదేశాల నుంచి వచ్చిన రిమిటెన్సులు 137 బిలియన్ డాలర్లకు చేరి ప్రపంచంలోనే అత్యధికంగా నమోదయ్యాయి. ఇది భారత విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడమే కాకుండా కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించింది.

అదేవిధంగా భారతీయులు ప్రపంచ సాంకేతిక, వ్యాపార రంగాల్లో కీలక స్థానాలను అధిరోహించడం దేశ ప్రతిష్ఠను పెంచుతోంది. ప్రముఖ అంతర్జాతీయ సంస్థల్లో భారతీయుల నాయకత్వం ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిభకు గుర్తింపును తెచ్చిపెడుతోంది. విదేశాల్లో స్థిరపడిన నిపుణులు పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార సంబంధాలను భారతదేశానికి తీసుకురావడం కూడా సానుకూల పరిణామమే.

అయితే "బ్రెయిన్ డ్రెయిన్"ను తగ్గించడానికి దేశీయంగా అనుకూల వాతావరణం కల్పించడం అవసరం. విశ్వవిద్యాలయాల్లో ప్రపంచ స్థాయి పరిశోధన సదుపాయాలు, స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహం, పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధానం, ప్రతిభకు తగిన వేతనాలు, పరిశోధన నిధుల పెంపు వంటి చర్యలు కీలకం. విదేశాల్లో అనుభవం సంపాదించిన భారతీయులు తిరిగి వచ్చి దేశాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలి.

నేడు భారతదేశం ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటి. ఈ నేపథ్యంలో ప్రతిభ విదేశాలకు వెళ్లడాన్ని పూర్తిగా నిరోధించడం సాధ్యం కాదు; అవసరమూ కాదు. కానీ ఆ ప్రతిభతో దేశానికి దీర్ఘకాలిక ప్రయోజనం కలిగే విధంగా విధానాలు రూపొందించడం అత్యవసరం. "బ్రెయిన్ డ్రెయిన్"ను "బ్రెయిన్ గెయిన్"గా మార్చగలిగితేనే అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి బలమైన పునాది పడుతుంది.



# జనసేన నియోజకవర్గ సమావేశాలు

అనకాపల్లి జూన్ సోమవారం 29. జయ జయహే

జనసేన నియోజకవర్గ సమావేశాలు ఈనెల 30 నుండి మూడో తేదీ వరకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పరిశీలకు పెండం దొరబాబు పేర్కొన్నారు సోమవారం స్థానిక విజయ రెసిడెన్సులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి అన్ని నియోజకవర్గాల్లో పార్టీలో మంచి క్యాడర్ నాయకత్వం పార్టీలో చురుగ్గా ఉన్న యువతను, వీర మహిళలను గుర్తించి పార్టీలో గుర్తింపు పదవులు ఇవ్వడం జరుగుతుందని దీనికోసం ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహించడం జరుగుతున్నది ఈనెల 30న ఎలమంచిలి ఒకటో తేదీ చోడవరం మధ్యాహ్నం మాడుగుల రెండో తేదీ న నర్సీపట్నం అలాగే అనకాపల్లి పెందుర్తి నియోజకవర్గం లో సమావేశాలు కార్యకర్తలతో అక్కడ స్థానిక ఎమ్మెల్యే నాయకులతో నిర్వహించడం జరుగుతుందని సంస్థ గతంగా పార్టీకి బలం పెరుగుతుందని కార్యకర్తల శిక్షణా కార్యక్రమం కూడా నిర్వహిస్తామని మంచి పరిపాలన అందించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారని పార్టీ బలోపేతానికి కూడా ఆయన ఎంతో దోహద పడుతున్నారని నిరంతరం తన నమ్ముకున్న పార్టీ కార్యకర్తలు గురించి ఆయన మంచి ఆలోచన చేస్తున్నారని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పార్టీని మరింత ముందుకు నడిపించాలని ఈ పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్తకు వారి శ్రమకు గుర్తింపు ఉంటుందని వారికి సముచిత స్థానం పార్టీ నాయకత్వం కల్పిస్తుందని వారి పేర్కొన్నారు. పార్లమెంటు నియోజకవర్గం నుండి 28 మందిని పార్టీ నిర్మాణ సారథులు నియమించడం జరిగిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# భూకంపాల యుగంలో సురక్షిత భవిష్యత్తు ఎలా?

(సి.హెచ్.ప్రతాప్)



వెనిజులాలో ఇటీవల సంభవించిన వరుస భారీ భూకంపాలు ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. కేవలం 39 సెకన్ల వ్యవధిలో 7.2, 7.5 తీవ్రతలతో రెండు భూకంపాలు సంభవించడంతో ఉత్తర వెనిజులాలోని లా గ్వైరా, కారకాస్ సహా అనేక ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భవనాలు కుప్పకూలడం, రహదారులు ధ్వంసం కావడం, విద్యుత్, సమాచార వ్యవస్థలు స్తంభించిపోవడం వల్ల సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. వేలాది మంది గాయపడగా, భారీ సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు సహాయక బృందాలు అహర్నిశలు శ్రమిస్తున్నాయి. ఈ విషాదం ప్రకృతి శక్తి ముందు మానవ నాగరికత ఎంత బలహీనమో మరోసారి గుర్తు చేసింది.

ఇది ఒక్క సంఘటన మాత్రమే కాదు. గత కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా వరుసగా సంభవిస్తున్న భారీ భూకంపాలు మానవాళిని అప్రమత్తం చేస్తున్నాయి. 2023లో టర్కీ--సిరియా సరిహద్దులో సంభవించిన 7.8, 7.5 తీవ్రతల భూకంపాలు ఆధునిక చరిత్రలోనే అత్యంత విషాదకర ప్రకృతి విపత్తులలో ఒకటిగా నిలిచాయి. 55 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వందలాది పట్టణాలు శిథిలాలుగా మారాయి. పునర్నిర్మాణానికి వందల బిలియన్ డాలర్ల వ్యయం అవసరమవుతుందని అంచనా వేశారు. ఈ సంఘటన నాణ్యమైన నిర్మాణ ప్రమాణాలు, పట్టణ ప్రణాళిక ఎంత కీలకమో ప్రపంచానికి స్పష్టంగా తెలియజేసింది.

అలాగే 2024లో తైవాన్‌లోని హువాలియన్ కౌంటీలో సంభవించిన 7.4 తీవ్రత భూకంపం మరో ముఖ్యమైన పాఠాన్ని నేర్పింది. భూకంపం తీవ్రంగా ఉన్నప్పటికీ, తైవాన్‌లో అమలులో ఉన్న కఠినమైన భూకంప నిరోధక నిర్మాణ నిబంధనలు, వేగవంతమైన హెచ్చరిక వ్యవస్థలు, ప్రజలలో ఉన్న అవగాహన వల్ల ప్రాణనష్టం గణనీయంగా తగ్గింది. ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా అడ్డుకోలేకపోయినా, సమర్థవంతమైన సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించవచ్చని తైవాన్ ప్రపంచానికి నిరూపించింది.

భూకంపాల విషయంలో జపాన్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. అత్యాధునిక భూకంప ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, ప్రతి పాఠశాలలో నిర్వహించే మాక్ డ్రిల్లులు, భూకంప నిరోధక సాంకేతికతతో నిర్మించిన భవనాలు అక్కడ సాధారణ అంశాలుగా మారాయి. ఇండోనేషియా, మయన్మార్ వంటి దేశాలు కూడా సునామీ హెచ్చరిక వ్యవస్థలు, విపత్తు స్పందన బృందాలను బలోపేతం చేస్తున్నాయి. ప్రకృతి విపత్తులను పూర్తిగా నివారించలేకపోయినా, సమర్థవంతమైన నిర్వహణ ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని ఈ దేశాలు నిరూపిస్తున్నాయి.

భారతదేశం కూడా ఈ పరిణామాలను అత్యంత గంభీరంగా పరిగణించాలి. హిమాలయ ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్-నికోబార్ దీవులు, గుజరాత్, ఉత్తర భారతంలోని అనేక ప్రాంతాలు అధిక భూకంప ప్రమాద మండలాల్లో ఉన్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ భూకంప నిరోధక నిర్మాణాలను తప్పనిసరి చేయడం, పాత భవనాలను బలోపేతం చేయడం, అత్యవసర ప్రతిస్పందన ప్రణాళికలు సిద్ధం చేయడం, పాఠశాలలు, కార్యాలయాల్లో క్రమం తప్పకుండా మాక్ డ్రిల్లులు నిర్వహించడం, కుటుంబ స్థాయిలో అత్యవసర కిట్లు సిద్ధంగా ఉంచుకోవడం వంటి చర్యలను సూచిస్తోంది. ప్రజల అవగాహన పెరిగితేనే విపత్తుల సమయంలో గందరగోళం తగ్గుతుంది.

భూకంపాలకు వాతావరణ మార్పులు నేరుగా కారణం కావని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అవి భూమి అంతర్భాగంలోని టెక్టానిక్ ఫలకాల కదలికల ఫలితమే. అయితే వాతావరణ మార్పుల కారణంగా వరదలు, తుఫానులు, కొండచరియలు విరిగిపడటం, సముద్ర మట్టం పెరగడం వంటి ఇతర ప్రకృతి వైపరీత్యాలు తీవ్రతరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏ దేశమైనా ఒకే రకమైన విపత్తుకు కాకుండా బహుళ విపత్తులను ఎదుర్కొనే సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

వెనిజులా భూకంపం ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతోంది. ప్రకృతిని జయించడం కాదు, ప్రకృతితో సమతుల్యంగా జీవించడం నేర్చుకోవాలి. శాస్త్రీయ ప్రణాళిక, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, కట్టుదిట్టమైన నిర్మాణ ప్రమాణాలు, సాంకేతిక ఆధారిత హెచ్చరిక వ్యవస్థలు, ప్రజల్లో అవగాహన, అంతర్జాతీయ సహకారం----ఇవే భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల ప్రభావాన్ని తగ్గించే నిజమైన ఆయుధాలు. ప్రకృతి పంపుతున్న ఈ హెచ్చరికను ప్రపంచ దేశాలు నిర్లక్ష్యం చేయకుండా, భవిష్యత్ తరాల భద్రత కోసం ఇప్పటి నుంచే సమిష్టి చర్యలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

# జనసైనికులే రేపటి నాయకులు

విజయనగరం (జయ జయహే )

విజయనగరం జనసేన నాయకులు పార్లమెంట్ పరిశీలకులు కోరికాన రవికుమార్, జనసేన సీనియర్ నాయకులు గురాన అయ్యలు మెసానిక్ టెంపుల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు కోరికాన రవి కుమార్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. కార్యకర్తలను కేవలం ఓట్లు వేసేందుకో, ప్రచారాలు చేసేందుకో పరిమితం చేయకుండా, వారికి ఉజ్వల రాజకీయ భవిష్యత్తును ఇవ్వాలనేది ఆయన దూరదృష్టి అని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు కష్టపడిన ప్రతి సామాన్య జనసైనికుడిని రేపటి తరం నాయకుడిగా ఎదగాలనే ఉద్దేశంతోనే ఈ కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఈ సమాచార సేకరణ, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం నుండి క్షేత్రస్థాయిలో చాలా ఉత్సాహంగా ప్రారంభమైందని వెల్లడించారు. జూలై 2 వ తేదీ వరకూ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ ఈ విజయనగరం మెసానిక్ టెంపుల్ నందు దరఖాస్తులను స్వీకరిస్తామని, విజయనగరం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నాయకులు, క్రియాశీల కార్యకర్తలు ఎవరైనా సరే ఇక్కడికి వచ్చి తమ దరఖాస్తులను




సమర్పించవచ్చని స్పష్టం చేశారు. అనంతరం సీనియర్ నాయకుడు గురాన అయ్యలు మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి ప్రాణం అని నమ్మే ఏకైక నాయకుడు పవన్ కల్యాణ్ అని, విలువలతో కూడిన రాజకీయం అంటే ఎలా ఉంటుందో ఆయన తన నిర్ణయాల ద్వారా నిరూపిస్తున్నారని అన్నారు. ఈ కమిటీ కేవలం దరఖాస్తులు తీసుకోవడానికే పరిమితం కాదని, క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్న నేతల సేవలు, వారిలో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలు, పార్టీ సిద్ధాంతాల పట్ల వారికి ఉన్న అంకితభావం వంటి ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తామని చెప్పారు. ఇక్కడ తాము సేకరించిన పూర్తి సమాచారాన్ని ఒక సమగ్రమైన నివేదిక రూపంలో తయారు చేసి నేరుగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పరిశీలనకు పంపిస్తామని, పవన్ కల్యాణ్ ఆశయాల అడుగుజాడల్లోనే భవిష్యత్తు నాయకత్వాన్ని తాము తీర్చిదిద్దుతారని వివరించారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం





## గిరిజన ప్రాంతాల్లో జనసేనను మరింత బలోపేతం చేస్తాం: నాగబాబు

అరకులోయ: జయ జయహే.


జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, గిరిజన ప్రాంతాల్లో పార్టీ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని శాసన మండలి సభ్యులు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోణిదెల నాగబాబు తెలిపారు. అరకులోయలో నిర్వహించిన జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా అరకు పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలం, గ్రామంలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ ఆవిర్భావం నుంచి గత 12 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించడం జనసేన లక్ష్యమని ఆయన అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించేందుకు నాయకత్వం కట్టుబడి ఉందని, నిబద్ధతతో పనిచేసే వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని నాగబాబు పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీని మరింత పటిష్టం చేస్తున్నామని, అరకు పాడేరు నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పోటీ చేసే అవకాశాలపై కార్యకర్తల్లో ఉత్సాహం ఉందని పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేసి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గిరిజనుల హక్కులను పరిరక్షించే రాజ్యాంగబద్ధ చట్టాలను కాపాడేందుకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని నాగబాబు స్పష్టం చేశారు. గిరిజనుల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, ప్రాంతీయ అభివృద్ధే పార్టీ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. సమావేశంలో పార్టీ నిర్మాణం, సభ్యత్వ నమోదు, గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు, రాబోయే రాజకీయ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. అరకు పార్లమెంట్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని నాగబాబు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, నిర్మాణ సారథులు, సమాచార సేకరణ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా జరిగిన అనకాపల్లి ఐకాన్, అప్సర ఈవెంట్

అనకాపల్లి జూన్ సోమవారం 29 జయ జయహే

అనకాపల్లి కంటెంట్ క్రియేటర్స్ అనే కార్యక్రమం ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం అత్యంత ఘనంగా అనకాపల్లి అప్సర, అనకాపల్లి ఐకాన్ ఈవెంట్ ఆధర్యంలో అనకాపల్లి అప్సర అవార్డును టి కళ్యాణి కైవసం చేసుకోగా అనకాపల్లి ఐకాన్ అవార్డును అనకాపల్లి కి చెందిన లిఖిత్ గెలుపొందారు అనకాపల్లి అప్సర అవార్డు గెలుపొందిన మహిళ మూలపేట గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళ కావడం విశేషం ఈ పోటీల్లో 60 మంది మహిళలు 40 మంది పురుషులు పాల్గొనగా వారిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు విజేతలుగా న్యాయ నిర్ణేతలు విశాఖకు చెందిన ఉదయగిరి, చంద్రశేఖర్ అల్లాడ బాల సౌజన్యకుమారి ప్రకటించారు ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ అనకాపల్లి ఇన్చార్జ్ భీమర శెట్టి రాంకి ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు మగువల రాంప్ వాక్ చిన్నారుల ర్యాంపు వాక్ లు ప్రేక్షకులను బాగా ఆకట్టుకోవడం జరిగింది అనంతరం ప్రతిభ కనబరిచిన చిన్నారులు కు కళాకారులకు సర్టిఫికెట్లను జనసేన పార్టీ ఇంచార్జ్ రామ్ కి అందజేయడం జరిగింది ఈ సందర్భంగా రామ్ కి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారి ప్రోత్సాహం అందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని కోరుకుంటూ అనకాపల్లి ఇన్ ఫుల్యినర్స్ అండ్ కంటెంట్ క్రియేటర్ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన కార్యక్రమాలు నిర్వహించి యువతకు ప్రోత్సాహం ప్రారంభంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు మాజీ శాసనసభ్యులు పీల గోవింద సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నపిల్లలను ఆయన అభినందిస్తూ ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఈవెంట్ కన్వీనర్ మల్లవంశీ ,సుహాస్ అభి ,మద్దాల క్రాంతి కుమార్, మద్దాల వంశి, సాయికుమార్ చరణ్, వై భార్గవ్ ,బి ప్రియాంక, జి ప్రియంక పిల్లల తల్లిదండ్రులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు



## రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం.

ఎరువుల విత్తనాలు పంపణికి సిద్ధం చేయాలి: మంత్రి సంధ్యారాణి.

మక్కువ : (జయ జయహే)

రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కోటమి ప్రభుత్వం పనిచేస్తుందని, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మక్కువ మండలం కేంద్రానికి సమీపంలో చెముడు రోడ్డులోని పాసల భారతి వ్యవసాయ పొలంలో వ్యవసాయ శాఖ నిర్వహించిన ఏరువాక పౌర్ణమి వేడుక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు సాంప్రదాయబద్ధంగా ఎద్దులకు ప్రత్యేక అలంకరణ, పూజలు జరిపి, నాగలిపట్టి రైతులతో కలిసి దుక్కి దున్ని ఖరీఫ్ వ్యవసాయ పనులను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రైతులను వ్యవసాయ రంగంలో అభివృద్ధిపరచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసి, ఆదుకునేందుకు కేటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఇందుకోసం ప్రతి యేటా రైతు ఖాతాలో ఇరవై వేల రూపాయలను మూడు విడతల్లో పెట్టుబడి సహాయం కింద అందజేస్తామని తెలిపారు. ఖరీఫ్‌లో రైతులకు తొంభై శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలను అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల పంపిణీలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి, ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతుల అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది అన్నారు. రాష్ట్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతిసిద్ధమైన వ్యవసాయం చేసేందుకు రైతులు సిద్ధపడాలని ఆమె పిలుపునిచ్చారు. మక్కు మెయిన్ రోడ్డులో విస్తరణ పనులకు ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా పూర్తి చేస్తామన్నారు. ఎనిమిది కోట్ల రూపాయల వ్యయంతో మక్కు మెయిన్ రోడ్డు కాలువలు, పక్క రోడ్డు నిర్మాణం పూర్తిచేసి మండల ప్రజలకు కానుకగా ఇస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, వాతావరణంలో ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా కురుస్తాయని వ్యవసాయ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నందున, అందుకు తగినట్టుగా రైతులు ఖరీఫ్ తాగు పంటలు వేసేందుకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. యూరియాను అవసరానికి మించి వాడకుండా, మట్టి పరీక్షల నమూనా ఆధారంగా ఎరువులను వాడుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీఏఐఎం మ్యాప్స్ యాప్ ద్వారా సాగు విస్తీర్ణానికి అనుకూలంగా ఎరువులు పంపిణీ జరుగుతుందని, ప్రతి రైతుకు రైతు సేవా కేంద్రాల ద్వారా ఓటీపీ ఆధారిత గుర్తింపుతో కావలసిన ఎరువులను రైతులు పొందాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సాలూరు వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు జీ సత్యవతి మాట్లాడుతూ, ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మండల కేంద్రాల్లో ఉన్న తమ శాఖ అధికారులకు తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ పీవో ఆర్ వైశాలి, ఆర్డీఓ కే మాధురి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ఎస్ఐ ఎం వెంకటరమణ పాల్గొన్నారు.



# సమిష్టి కృషితో మలేరియా, డెంగు నివారణ కృషి చేయాలి





### మూడు నెలలపాటు ప్రత్యేక కార్యాచరణ అమలు

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వర్ రావు

**విశాఖపట్నం (జయ జయహే)**

క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన ద్వారా జ్వరాలను గుర్తించి నియంత్రించడానికి అందరూ సమిష్టి కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు గారు ఆదేశించారు. జిల్లా మలేరియా విభాగం సిబ్బంది సమీక్ష సమావేశాన్ని ఆయన సోమవారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన తోపాటు నీటి నిల్వలను, జ్వర బాధితులను గుర్తింపు చర్యలను పగడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సిబ్బందికి నిర్దేశించిన ప్రాంతాలలో రోజువారి క్షేత్ర పర్యటనలు తప్పనిసరిగా నిర్వహించాలని పేర్కొన్నారు. మూడు నెలలపాటు రూపొందించిన ప్రత్యేక కార్యాచనాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జరపీడుతులకు రాపిడ్ డయాగ్నొస్టిక్ పరీక్షలను నిర్వహించి, జ్వరం నిర్ధారణ అయితే చికిత్స ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమ కాటు ద్వారా ప్రభలే మలేరియా, డెంగు జ్వరాలు నియంత్రణకు నీటి నిల్వలా తొలగింపు ప్రక్రియ చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. దీనికి అమల్లో ఉన్న ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం మంగళవారం క్షేత్రస్థాయిలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ూ ూ, సిబ్బంది నీటి నిల్వలా తొలగింపు కోసం నియమించిన ప్రత్యేక సిబ్బంది సంయుక్తంగా పటిష్టవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ మలేరియా అధికారులు నాగభూషణం, సబ్ యూనిట్ అధికారులు నగేష్ పట్నాయక్ పొన్నాడ శేషు బాబు తదితరులు తదితరులు పాల్గొన్నారు



## సహకార వారోత్సవాలలో భాగంగా మొక్కలు నాటిన తంగేళ్లపాలెం పీఏసీఎస్

**తొట్టంబేడు.(జయ జయహే )**

సహకార వారోత్సవాల్లో భాగంగా సహకారం ద్వారా సమృద్ధినినాదంతో తొట్టంబేడు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.తిరుపతి జిల్లా సహకార శాఖ ఆదేశాల మేరకు సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం చేపట్టారు.సంఘ అధ్యక్షులు బీమాల భాస్కర్ ముదిరాజ్, సహకార శాఖ అధికారి,సంఘ సీఈవో పి.చిరంజీవిరెడ్డి, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం సంయుక్తంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సంఘ ఉద్యోగులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు రకాల మొక్కలను నాటారు.హరితహారం పెంపునకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సంఘ అధ్యక్షులు భాస్కర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.సహకార సంఘాలు కేవలం ఆర్థిక సేవలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యత కలిగిన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సీఈవో చిరంజీవిరెడ్డి తెలిపారు.సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం, రైతులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎఎంసి వైద్య విద్యార్థులకు బెస్ట్ డెలిగేట్ అవార్డు

**విశాఖపట్నం, జూన్ 29 (జయ జయహే)**

వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ నిర్వహించిన వరల్డ్ హెల్త్ అసెంబ్లీ పోటీలో ఆంధ్రా వైద్య కళాశాల విద్యార్థులు మెరిశారు.ఈ పోటీల్లో పాల్గొన్న ఎఎంసి వైద్య విద్యార్థులు సుభి రాజ్,సుశాంత్ దూబే "బెస్ట్ డెలిగేట్" బహుమతిని అందుకున్నారని ఆంధ్రా మెడికల్ కాలేజీ సోమవారం ప్రకటించింది. కాగ్నిటో 2026లో భాగంగా నిర్వహించిన ఈ వరల్డ్ హెల్త్ అసెంబ్లీ పోటీ ని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్, వెల్లూరు లో నిర్వహించినట్టు ఎ ఎం సి ప్రిన్సిపాల్, ఆదనపు డిఎంఈ డాక్టర్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యా దేవి, ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె విజేతలైన కళాశాల కు చెందిన వైద్య విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ ఇంచార్జి హెచ్ఓడి డాక్టర్ సి.శివ కళ్యాణి, మైక్రోబయాలజీ అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణ





**అనకాపల్లి జూన్, సోమవారం 29, జయ జయహే**

వ్యవసాయానికి మన సంస్కృతిలో ఉన్న ప్రాధాన్యతను చాటి చెబుతూ రైతులకు శుభ సూచకంగా నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మండలంలో ని బయ్యవరం గ్రామంలో పొలం బాట పట్టే పవిత్ర సుముహూర్తం సమయాన ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్,ూ్రాఖఖీ×ణజ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో కలిసి సాంప్రదాయ పద్ధతిలో భూమి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణ పాల్గొని ఎడ్లతో, ట్రాక్టర్ తో పొలాన్ని దున్ని, విత్తనాలు జల్లి కొత్త వ్యవసాయ సాగుకు శ్రీకారం చుట్టారు రైతులు సుభిక్షంగా ఉండాలని రైతుల బాగుంటేనే దేశం బాగుంటుంది దేశానికి రైతులు వెన్నుముక లాంటి వారిని పేర్కొంటూ పంటలు సమృద్ధిగా పండాలని ఆంకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు వివిధ శాఖల డిపార్ట్మెంట్ పాల్గొని వివిధ స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ వ్యవసాయ యంత్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం సబ్సిడీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి నాయకత్వంలో రైతుల సంక్షేమ కోసం అనేక ప్రోత్సాహ కార్యక్రమాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని వారు పేర్కొన్నారు .పోలవరం ఎడమ కాలువ పనులు డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా చర్యలు జరుగుతున్నాయని దీంతో జిల్లాల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అలాగే ఉత్తర ఆంధ్ర సృజలా స్రవంతి ప్రాజెక్టు ద్వారా మూడు జిల్లాల్లో మరో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని కాలువల పూడిక తీత మరమ్మత్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రతి పంట మడికి నీరు చేరేలా చర్యలు చేపట్టిందని రైతుల పక్షాన పని చేస్తున్న కలెక్టర్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాది యూరియా కొరత ఉండదని, పాస్బుక్ ఆధారంగా రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు పంపిణీ జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని 2047 నాటికి రాష్ట్రాన్ని పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయ రాష్ట్రంగా తీర్చిదిద్దడమేనని ప్రభుత్వం లక్ష్యమన్నారు .రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు సంవత్సరానికి 20000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఆధునిక సాంకేతిక ఆర్ట్ అఫీషియల్ ఇంటిలిజెన్సీ ఫార్మ ఆటోమేషన్ వంటి విధానాలను వ్యవసాయంలో ప్రవేశపెట్టి దిగుబడులు పెంచడంలో తో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో వినూత సాంకేతికతను ప్రోత్సహించేందుకు పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించి రైతులకు చేసి చూపించే విధానంలో ఆదర్శ వ్యవసాయ నమూనాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే రామకృష్ణ పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులు రైతులు గ్రామ పెద్దలు మహిళలు కార్యకర్తల పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది



## జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజుల్లో 100% రాయితీ

### జిల్లా కలెక్టర్ నిషాంతి ఉత్తర్వులు

**పాడేరు, జయ జయహే :**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం అండగా నిలిచింది. అర్హులైన, అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజుల్లో 100 శాతం రాయితీ కల్పిస్తూ జిల్లా కలెక్టర్ నిషాంతి (ఐఏఎస్) సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే ) నాయకులు జిల్లా కలెక్టర్ నిషాంతిని మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లాలోని పాత్రికేయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.

**సమస్యలపై సానుకూల స్పందన**

జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. నాగరాజు జిల్లాలో ఉన్న జర్నలిస్టుల సమస్యలను, సమాచార సంబంధాలు, ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతుగా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కలెక్టర్**

జిల్లాలో పనిచేసే పాత్రికేయులు కేవలం గ్రామాల్లోని సమస్యలను ఎత్తిచూపడమే కాకుండా, ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న మంచి పనులను, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కూడా విస్తృతంగా ప్రచురించి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కలెక్టర్ కోరారు. ఫీజుల రాయితీపై కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల జిల్లాలోని పాత్రికేయ లోకం హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి ( డిపిఆర్ఓ ) కె. వెంకటరావు, ఐఅండ్‌పిఆర్ సిబ్బంది సంధ్య కుమార్ పాల్గొన్నారు. అలాగే ఏపీయూడబ్ల్యూజే నాయకులు రాజేష్, ప్రకాష్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు పి. సత్యనారాయణ, బి. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.




## సేవకు నిదర్శనం భట్టిప్రోలు

### శ్రీనివాసరావు ను సత్కరించిన లయన్స్ క్లబ్ సభ్యులు

**భీమవరం ; (జయ జయహే )**

నిరంతరం శ్రామికులు, సేవాతత్పరులు, సేవకు నిదర్శనం భట్టిప్రోలు శ్రీనివాసరావు అని లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు బొండా రాంబాబు నూతన అధ్యక్షులు గోపిశెట్టి మురళీకృష్ణ నూతన ఫెమినా క్లబ్ అధ్యక్షులు మహిళ అధ్యక్షురాలు డా భూపతిరాజు ఐశ్వర్య, అన్నారు. భీమవరంలో జరిగిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో భట్టిప్రోలు ను లయన్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. భీమవరం పట్టణంలో జరిగే ప్రతి సేవా కార్యక్రమంలోనూ లయన్స్ క్లబ్ ద్వారా జరిగే కార్యక్రమంలో భట్టిప్రోలు అందిస్తున్న సేవలు ఎనలేనివని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో లయన్ చిలువూరి కృష్ణంరాజు, లయన్ డా ఎం వీ సూర్యనారాయణ రాజు,లయన్ ఆర్ వీ సూర్యనారాయణ రాజు, లయన్ వి వి కృష్ణంరాజు,లయన్ వబిలిశెట్టి కనకరాజు,లయన్ నడింపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మనుగడ కరువు

### కూటమి ప్రభుత్వం లక్ష్యాలను నెరవేర్చాలి

### ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**టెక్కలి జూన్ 29 జయ జయహే**



రాష్ట్రంలో గ్రామీణ స్థాయిలో ఉన్నత లక్ష్యాలతో సమగ్ర ప్రాథమిక విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మనుగడ కోల్పోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఏటా ప్రాథమిక విద్యను అందుబాటులో ఉంటుందన్న నమ్మకం గ్రామీణులకుల లేకుండా పోతుంది, ఇది ఇలాగే కొనసాగితే గ్రామస్థాయిలో ప్రాథమిక విద్య శూన్యం అవుతుంది దీని ద్వారా నిరక్షరాస్యత సమస్య మొదటి వస్తుందని పలువురు పూర్వ విద్యార్థులు, ఆందోళన చెందుతున్నారు, దేశంలో ప్రపంచ స్థాయిలో ఎందరో మహానుభావులు ప్రముఖులు గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో చదువుకొని గొప్ప స్థాయికి వెళ్లిన వారు ఉన్నారు. పల్లెల్లో ప్రాథమిక విద్య మసక బారడానికి విద్యా హక్కు చట్టాన్ని నీరుగర్చే దిశగా కొనసాగుతుంది , దీనికి ఎవరు బాధ్యులు అనే సున్నితమైన సమస్యపై ప్రభుత్వం సమగ్రమైన సర్వే చేయాల్సిన అవసరం ఎంతో ఉంది, లోపం ఎక్కడో సమస్య పరిష్కారం అక్కడే జరగాలి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రాంతాల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు మహిళలు సమగ్రంగా ఆలోచించి మా ఊరి బడిని పరిరక్షించుకోవాలని దృక్పథాన్ని కలిగించాల్సిన అవసరం సంబంధిత శాఖల అధికారులు గ్రామ పెద్దలు స్థానికులపై ఉందని పలువురు విద్యాహి తవరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య పాఠశాలలను ఎత్తివేయకుండా ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. టెక్కలి మండలంలో ఇదివరకు పల్లెల్లోని పలు పాఠశాలలు కనుమరుగైనప్పటికీ ఈ ఏడాది మరో 10 పాఠశాలలు స్థానిక విద్యార్థుల హాజరు లేక ఎత్తివేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు, టెక్కలి మండలంలోని జీరో అడ్మిషన్లు కారణంగా జగన్నాధపురం ఎంపీపీ పాఠశాల, బలరాంపురం, చల్లపేట, చింతల గార, జెండా పేట, కిట్టాలపాడు, సవరకిల్లి, తేలి నీలా పురం, లచ్చన్నపేట, ప్రాథమిక పాఠశాలలు మూసేందుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయి , స్థానిక గ్రామస్తులు, తల్లిదండ్రులు గ్రామ పెద్దలు తమ గ్రామంలోని , దేవాలయాలు మాదిరిగా బడులను పరిరక్షించుకోవాల్సిన అవసరం బాధ్యత ఎంతో ఉందని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

# మ్యారేజ్ పుకార్లకు కావ్య మారన్ చెక్






ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ అయిన కావ్య మారన్ వివాహానికి సంబంధించి ఒక కీలక మైన అప్‌డేట్ బయటపడింది. ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్‌తో ఆమె వివాహంపై ఖాయమైందని తెలుస్తోంది. అయితే, కావ్య వివాహం అకస్మాత్తుగా చర్చనీయాంశంగా ఎలా మారిందనే ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి, అనిరుద్ధ మామ, నటుడు వైజీ మహేంద్ర, కావ్య, అనిరుద్ధల వివాహం గురించి మాట్లాడారు. కేపీటీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, అనిరుద్ధ వివాహం గురించిన ప్రశ్నకు వైజీ మహేంద్ర స్పందిస్తూ, "అనిరుద్ధ చాలా కూల్‌గా ఉండే అబ్బాయి. నాకు తెలిసిన సమాచారం ప్రకారం, కావ్య మారన్‌తో అతని వివాహం దాదాపు ఖరారైంది. అతను చాలా పెద్ద కుటుంబం లోకి అడుగుపెడుతున్నాడు. ఈ సందర్భంగా నేను అతనికి అభినందనలు తెలియజేయాలనుకుంటున్నాను" అని అన్నారు. కావ్య మారన్ గురించి మాట్లాడుతూ, "కావ్య సాధారణ అమ్మాయి కాదు. అంత పెద్ద ఐపీఎల్ జట్టును నిర్వహించగల సామర్థ్యం ఆమెకు ఉంది. ఆమె తన తండ్రి నుంచి వ్యాపార నైపుణ్యాలను వారసత్వంగా పొందింది. వాళ్లిద్దరూ మంచి జోడీ. వాళ్లిద్దరూ కలిసి సంగీత రంగంలో తమ అద  ష్టాన్ని పరీక్షించుకోవాలి." ఇప్పుడు, కావ్య, అనిరుధ్‌ల పెళ్లి ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందని మీరు ఆలోచిస్తున్నారా ప్రస్తుతం దీని గురించి ఎటువంటి కచ్చితమైన సమాచారం లేదు. వారిద్దరూ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. గతంలో వారిద్దరూ డేటింగ్ చేస్తున్నారని వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తలపై ఇరుపక్షాల నుంచి ఎలాంటి అప్‌డేట్ లేదు. పెళ్లి గురించి కూడా ఇరుపక్షాలు ఎలాంటి ప్రకటన చేయలేదు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, 2025లో, వారిద్దరూ సుమారు ఒక సంవత్సరం నుంచి డేటింగ్ చేస్తున్నారని రెడ్డిట్‌లో ఒక వైరల్ పోస్ట్ పేర్కొంది.

### గ్రూప్ స్టేజ్ నుంచే
# నిష్క్రమించిన టీమిండియా

మహిళల టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్‌లలో ఒకటిగా బరిలోకి దిగిన భారత జట్టుకు లీగ్ దశలోనే ఘోర పరాభవం ఎదురైంది. లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన డూ ఆర్ డై మ్యాచులో భారత్ ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 170 పరుగుల భారీ స్కోరు చేసినప్పటికీ.. ఆసీస్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ (56) మెరుపులతో కంగారూలు విజయం సాధించారు. దీంతో గ్రూప్-1 నుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. భారత్ వేదికగా జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో గెలిచి, తొలిసారి విశ్వకప్ గెలిచిన టీమిండియా మహిళల జట్టుకు టీ20 ప్రపంచకప్‌లో పరాభవం ఎదురైంది. ఇంగ్లాండ్ వేదికగా ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్ జట్లలో ఒకటిగా బరిలోకి దిగిన హర్మన్ ప్రీత్ సారథ్యంలో భారత మహిళల జట్టు .. లీగ్ స్టేజ్ నుంచే నిష్క్రమించింది. ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలై.. నాకౌట్ అవకాశాలను పోగొట్టుకుంది. ఈ టోర్నీలో గ్రూప్-1లో భారత్ ఆడుతోంది. దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం తర్వాత.. టీమిండియా సెమీస్ చేరాలంటే ఆస్ట్రేలి




యాతో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. లార్డ్స్ వేదికగా ఈ మ్యాచ్ జరిగింది. అయితే ఈ మ్యాచ్‌లో మొదటి బ్యాటింగ్ చేసిన టీమిండియా మంచి స్కోరు చేసింది. కానీ దాన్ని కాపాడుకోవడంలో విఫలమై వరల్డ్‌కప్ నుంచి నిష్కమించింది. కీలక పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఏ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు కావడం గమనార్హం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 56 రన్స్), స్మ  తి మంధాన (37 బంతుల్లో 38 పరుగులు) రాణించారు. అనంతరం ఆస్ట్రేలియా 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఎలీస్ పెర్రీ 38 బంతుల్లో 56 పరుగులు చేసి.. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఇక గ్రూప్ దశలో 5 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 2 పరాజయాలతో 6 పాయింట్లకే పరిమితమైన భారత్.. గ్రూప్-ఏలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆడిన ఐదు మ్యాచ్‌లలోనూ గెలిచిన ఆస్ట్రేలియా (10 పాయింట్లు), నాలుగింట గెలిచిన దక్షిణాఫ్రికా (8 పాయింట్లు) సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌తో ఆస్ట్రేలియా.. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఇంగ్లాండ్ తలపడతాయి. ఇప్పటివరకు భారత మహిళల జట్టు పదిసార్లు టీ20 ప్రపంచకప్‌లో ఆడింది. ఇందులో ఐదుసార్లు లీగ్ దశలోనే నిష్క్రమించింది. 2012, 2014, 2016, 2024, 2026లలో లీగ్ దశలోనే వెనుదిరిగింది. 2009, 2010, 2018, 2023లలో సెమీఫైనల్లో ఓడిపోయింది. 2020లో మాత్రం రన్నరప్‌గా నిలిచింది.



### ఫామ్ లేని ఆటగాళ్లను తీసేసి
# సూర్యవంశీని ఆడించండి

**మాజీ దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సూచన**

ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి ఒక్క అవకాశవ ఇవ్వకపోవడంపై భారత మాజీ దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ తీవ్ర అసంత  ప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్ పర్యటనలో జరిగే తొలి మ్యాచ్ నుంచే అతడిని తుది జట్టులోకి తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. జట్టులో ఫామ్ కోల్పోయిన ఆటగాళ్లను పక్కనబెట్టి వైభవ్‌కు అవకాశం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో వైభవ్ సూర్యవంశీని ఇంకా ఎంతకాలం బెంచ్‌పైనే ఉంచుతారు అతడికి ఎప్పుడు అవకాశం ఇవ్వాలి అనే ప్రశ్నకు గవాస్కర్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. ఇకపై ఆలస్యం చేయకుండా ఇంగ్లాండ్‌తో జరిగే తొలి మ్యాచ్‌లోనే అతడిని ఆడించాలని సూచించారు. ఓపెనర్లను మార్చాల్సిన అవసరం లేకపోతే, వైభవ్‌ను మూడో స్థానంలోనైనా బరిలోకి దించాలని పేర్కొన్నారు. గత నెల రోజులుగా ఇదే విషయాన్ని చెబుతున్నానని గవాస్కర్ గుర్తుచేశారు. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ వైభవ్‌కు అవకాశం ఇవ్వవచ్చని, ఒక మ్యాచ్‌లో అభిషేకతో, మరో మ్యాచ్‌లో సంజూ శాంసన్‌తో కలిసి ఓపెనింగ్ చేయించే అవకాశం జట్టు యాజమాన్యానికి ఉందన్నారు. యువ ఆటగాళ్లను తయారు చేయాలనే ఉద్దేశం ఉంటే ఆ సిరీస్ సరైన వేదికగా ఉపయోగపడేదని అభిప్రాయపడ్డారు. యువ ప్రతిభకు అవకాశాలు కల్పించడంలో జట్టు యాజమాన్యం విఫలమైందని, ముఖ్యంగా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకున్న నిర్ణయంపై గవాస్కర్ విమర్శలు గుప్పించారు. ఇకపై సమయం వ  థా చేయకుండా వైభవ్‌ను జట్టులోకి తీసుకుంటే అతడు తన ప్రతిభను నిరూపించుకుంటాడనే నమ్మకాన్ని కూడా వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత పురుషుల జట్టు వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసి సిరీస్‌ను కోల్పోయింది. 155 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత జట్టు చివరి బంతి వరకు పోరాడినా విజయానికి అడుగు దూరంలో నిలిచిపోయింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు పూర్తిగా విఫలం కావడంతో గెలవాల్సిన మ్యాచ్‌ను చేజార్చుకుంది. మధ్యవరుసలో తిలక వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అతడు 46 బంతుల్లో 55 పరుగులు చేసి మూడు ఫోర్లు, ఒక సిక్సర్ బాదాడు. అయితే కీలక సమయంలో అతడు ఔటవడంతో భారత విజయావకాశాలు దెబ్బతిన్నాయి. అప్పటికే మిగతా ప్రధాన బ్యాటర్లు పెవిలియన్ చేరుకోవడంతో చివరి బంతి వరకు ఉత్కంఠ కొనసాగినా భారత్ కేవలం ఒక పరుగు తేడాతో ఓటమి చవిచూసింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను కూడా కోల్పోయింది. చివరి వరుసలో హర్షిత్ రాణా 10 బంతుల్లో 21 పరుగులు చేసి రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే అతడు చూపిన పోరాట స్ఫూర్తిని టాప్ ఆర్డర్ బ్యాటర్లు ప్రదర్శించలేకపోవడం భారత పరాజయానికి ప్రధాన కారణంగా మారింది. ఐర్లాండ్ బౌలర్లలో జై ముంద్రా, మ్యాట్ హోలండ్ తలా మూడు వికెట్లు తీసుకుని భారత బ్యాటింగ్‌ను కట్టడి చేసి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించారు.

### భూకంప బాధితుల కోసం
# నేమార్ భారీ విరాళం

బ్రెజిల్ ఫుట్‌బాల్ సంచలనం నేమార్ వెనిజులాలో సంభవించిన అత్యవసర రెస్క్యూ, మానవతా సహాయక చర్యల కోసం ఏకంగా 2,50,000 డాలర్ల భారీ విరాళం ఇచ్చాడు. ఈ నిధులను భూకంప బాధితులకు తక్షణమే అవసరమైన ఫుడ్, తాగునీరు, మెడికల్ సప్లైస్, తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయడానికి ఉపయోగించనున్నారు. "నా హ దయం వెనిజులా ప్రజల కోసమే తపిస్తోంది" అని నేమార్ ఎమోషనల్ అయ్యాడు. తన వంతుగా ఇచ్చిన ఈ సాయం దారుణంగా దెబ్బతిన్న ఎన్నో కుటుంబాలకు ధైర్యాన్ని, ఉపశమనాన్ని ఇస్తుందని ఆశిస్తున్నట్లు నేమార్ చెప్పాడు. వెనిజులా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జార్జ్ రోడ్రిగ్జ్ అక్కడ జరిగిన నష్టాన్ని వివరించాడు. బుధవారం సంభవించిన భయంకరమైన ట్విన్ భూకంపాల (రెండు భారీ భూకంపాలు) వల్ల కనీసం 1,430 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విపత్తులో 3,238 మందికి పైగా తీవ్రంగా గాయపడగా, ఇళ్లు కోల్పోవడం వల్ల 3,142 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. రిక్టర్ స్కేలుపై 7.2, 7.5 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపాల తర్వాత కూడా వందలాది ఆఫ్టర్ షాక్స వస్తుండటంతో రెస్క్యూ టీమ్స్ ప్రాణాలతో ఉన్న వారిని కాపాడటానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. భారీ మిషనరీ కొరత వల్ల సహాయక చర్యలు కాస్త స్లోగా సాగుతున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బ్రెజిల్ ఫ్యాన్స్ కు ఒక అదిరిపోయే స్పోర్ట్స్ అప్‌డేట్ అందింది. గాయం నుంచి కోలుకుంటున్న నేమార్ ప్రెజెంట్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడని, జపాన్‌తో జరగబోయే ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్ లో ఎక్కువ సమయం ఆడేందుకు రెడీ అయ్యాడని బ్రెజిల్ హెడ్ కోచ్ కార్లో అన్సెలొట్టి హింట్ ఇచ్చాడు. లాస్ట్ వీకతో పోలిస్తే 34 ఏళ్ల నేమార్ ఫిట్‌నెస్ లెవెల్స్ అద్భుతంగా మెరుగయ్యాయని కోచ్ చెప్పాడు. వరల్డ్ కప్ ఫస్ట్ రెండు మ్యాచులకు దూరమైన నేమార్, స్కాట్లాండ్‌పై బ్రెజిల్ 3-0 తో సాధించిన విక్టరీలో లాస్ట్ 15 నిమిషాలు మాత్రమే సబ్‌స్టిట్యూట్ గా గ్రౌండ్ లోకి వచ్చాడు. ఇప్పుడు తను ఎక్కువ సేపు ఆడేందుకు వీలుగా రికవర్ అయ్యాడని కోచ్ క్లారిటీ ఇచ్చాడు. గ్రూప్-జ లో టాప్ పొజిషన్ లో నిలవడం ద్వారా బ్రెజిల్ టీమ్ వరల్డ్ కప్ హిస్టరీ లోనే ఒక అరుదైన రికార్డును కంటిన్యూ చేసింది. వరుసగా 12 వరల్డ్ కప్ టోర్నమెంట్లలో గ్రూప్ స్టేజ్ లో టాపర్‌గా నిలిచిన ఏకైక జట్టుగా బ్రెజిల్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. 1982 వరల్డ్ కప్ నుంచి ఇప్పటివరకు ప్రతీసారి బ్రెజిల్ తమ గ్రూప్‌లో నంబర్ వన్ సీటును అస్సలు వదులుకోలేదు. ఈ అద్భుతమైన 44 ఏళ్ల గ్రూప్-స్టేజ్ డామినేషన్ ను బ్రెజిల్ సక్సెస్ ఫుల్ గా కాపాడుకుంది. నాకౌట్ లో జపాన్‌ను దెబ్బకొట్టడానికి నేమార్ ఎంట్రీ ఇవ్వడం టీమ్‌కు కొండంత బలాన్ని ఇస్తుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.




### హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై
# ఐస్‌లాండ్ క్రికెట్ సెటైర్లు



ఐర్లాండ్ గడ్డపై టీమిండియాకు చరిత్రలోనే ఊహించని షాక తగిలింది. రెండు టీ20ల సిరీస్‌ను పసికూన ఐర్లాండ్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసి భారత్‌కు ఘోర పరాజయాన్ని పరిచయం చేసింది. ఈ ఓటమితో భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే ఐస్‌లాండ్ క్రికెట్ అసోసియేషన్.. గంభీర్‌కు అసాధారణ ప్రతిభ ఉందంటూ, అలాంటి కోచ్ తమకు వద్దంటూ అధికారిక ఖాతాలో వేసిన సంచలన సెటైరికల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.టీ20 ఛాంపియన్‌గా ఐర్లాండ్ గడ్డపై అడుగుపెట్టిన భారత్‌కు.. భారీ భంగపాటు ఎదురైంది. పసికూన ఐర్లాండ్‌తో జరిగిన రెండు టీ20 మ్యాచ్‌లలోనూ టీమిండియా పరాజయం పాలైంది. దీంతో చరిత్రలో తొలిసారిగా ఆ జట్టు చేతిలో సిరీస్ ఓడిపోయింది. అంతేకాకుండా మూడేళ్ల తర్వాత ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో ఓటమి నమోదు చేసింది. దీంతో టీమిండియాపై నెట్టింట దారుణంగా ట్రోల్స్ వస్తున్నాయి. హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియమితుడయ్యాక టీమిండియా.. టెస్టుల్లో ఆశించిన మేర రాణించట్లేదు. దీంతో అతడిపై ట్రోల్స్ వస్తుంటాయి. అయితే వన్డేలు, టీ20ల్లో మాత్రం సత్తాచాటుతోంది. కానీ తాజాగా ఐర్లాండ్ చేతిలో ఓటమి తర్వాత.. గంభీర్ మరోసారి ట్రోలర్స్‌కు టార్గెట్ అయ్యాడు. కానీ ఇప్పుడు ఈ జాబితాలో ఐస్‌లాండ్ క్రికెట్ కూడా చేరిపోయింది. ఇప్పటి వరకు ఐసీసీ సభ్యదేశం కూడా కాని ఐస్‌లాండ్ క్రికెట్ అసోషియేషన్ కూడా తన సోషల్ మీడియాలో గంభీర్‌ను ట్రోల్ చేసింది. "మేం (ఐస్‌లాండ్ క్రికెట్) గౌతమ్ గంభీర్‌ను మా కోచింగ్ స్టాఫ్‌గా తీసుకోవాలని అనుకోవడం లేదు. ఒకరకంగా మారు ఇలా చేయడం ఇష్టం లేదు కూడా. గంభీర్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది. కానీ భారత ఆటగాళ్లను తీసుకొచ్చి.. ఐర్లాండ్‌లో ఇలాంటి ఫలితాలను అందించాలంటే అసాధారణమైన ప్రతిభ కావాలి. అది గౌతమ్ గంభీర్ వద్ద పుష్కలంగా ఉందనిపిస్తోంది" అని ఐస్‌లాండ్ క్రికెట్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. మరోవైపు పసికూన ఐర్లాండ్ చేతిలో రెండు టీ20ల సిరీస్‌ను టీమిండియా కోల్పోవడం పట్ల మాజీల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చిన్న జట్టు అనే ఉదాసీనతే భారత జట్టు ఓటమికి కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఐర్లాండ్‌ను లైట్ తీసుకోవడం వల్లే.. చరిత్రలోనే అతి భయంకరమైన ఓటమి ఎదురైందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బ్యాటర్లు షాట్ల ఎంపిక దారుణంగా ఉందని విమర్శలు సైతం వస్తున్నాయి. టాప్ ఆర్డర్ వైఫల్యం కూడా టీమిండియా కొంపముంచింది.

# రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ఛాంపియన్‌గా అవతరించిన హైదరాబాద్ హీరోస్!

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన హెచ్ఎస్‌బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) రెండో సీజన్ ఫైనల్స్‌లో హైదరాబాద్ హీరోస్ జట్టు అద్భుతమైన ప్రదర్శనతో ముంబై డ్రీమర్స్‌ను 41-17 స్కోరుతో చిత్తు చేసి చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన ఈ మెగా ఫైనల్ మ్యాచ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీఎంఆర్ స్పోర్ట్స్, రగ్బీ ఇండియా సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ భారతీయ రగ్బీకి కొత్త మైలురాయి అయింది. ప్రపంచ స్థాయి ఆటగాళ్లు, భారీ ప్రేక్షకులు, మహిళల లీగ్‌తో పాటు ఈ సీజన్ అన్ని విధాలా విజయవంతంగా ముగిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ హీరోస్ జట్టుకు ట్రోఫీని బహూకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు కూడా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆటగాళ్ల స్ఫూర్తిని ప్రశంసించారు. ఈ ఈవెంట్ హైదరాబాద్‌ను క్రీడా హబ్‌గా మార్చడంలో కీలక పాత్ర పోషించింది. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రాంధి, మెగాస్టార్ చిరంజీవి, పీవీ సింధు, మ  ణాళ్ ఠాకూర్ వంటి ప్రముఖులు కూడా ముగింపు వేడుకలకు హాజరై ఈ క్రీడను మరింత ఆకర్షణీయం చేశారు.హైదరాబాద్ హీరోస్ జట్టు ఫైనల్‌లో క్లినికల్ ప్రదర్శనతో ముంబైని అధిగమించింది. మ్యాచ్ ప్రారంభంలో ముంబై బంతి నియంత్రణ సాధించినా, హైదరాబాద్ బలమైన డిఫెన్స్‌తో ఎదురుదాడులు చేసి ఆధిక్యం సాధించింది. ఫ్రాన్సిస్కో కాస్కుల్లోలా, తైతైఫోనో తావితాకు, శివమ్ శుక్లా, మాన్యుయెల్ మోరెనో, మారిస్ లాంగ్ వంటి ఆటగాళ్ల అద్భుత ప్రదర్శన హైదరాబాద్ విజయానికి కీలకమైంది. విరామ సమయానికి హైదరాబాద్ పూర్తి నియంత్రణలో ఉంది. రెండో హాఫ్‌లో కూడా డీగో అర్డావో, కెవిన్ వెకేసా, టెరియో తమాని గోల్స్‌తో ఆధిక్యాన్ని పెంచారు. ముంబై తరఫున ఇథన్ మెకఫార్లాండ్, జేమ్స్ టర్నర్, సుకుమార్ హెంబ్రోమ్ కొన్ని పాయింట్లు సాధించినా ఓటమి తప్పలేదు. ఈ విజయంతో హైదరాబాద్ హీరోస్ రూ.45 లక్షల ప్రైజ్ మనీని అందుకుంది. రన్నరప్ ముంబై డ్రీమర్స్‌కు రూ.25 లక్షలు, మూడో స్థానం సాధించిన బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్‌కు రూ.15 లక్షలు లభించాయి. మూడో స్థాన ప్లే-ఆఫ్‌లో బెంగళూరు చెన్నై బుల్స్‌ను 22-19తో ఓడించింది. ఈ టోర్నమెంట్‌లో మహిళల పోటీలు కూడా విజయవంతంగా జరిగి, రగ్బీలో మహిళల కెరీర్ అవకాశాలను పెంచాయి. భారీ సంఖ్యలో ప్రేక్షకులు స్టేడియంను తరిచి ఈ క్రీడను ఆస్వాదించారు. రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్ మాట్లాడుతూ, "ఈ సీజన్ గత ఏడాది కంటే అన్ని విధాలా మెరుగ్గా ఉంది. భారీ ప్రేక్షకులు, ప్రపంచ స్థాయి ఆటగాళ్లు, మహిళల లీగ్, అభిమానుల భాగస్వామ్యం, స్పాన్సర్‌షిప్‌లు, బ్రాడ్‌కాస్ట్ వ్యూయర్‌షిప్ అద్భుతంగా ఉన్నాయి. ఈ క్రీడపై ప్రేమ చూపిన ప్రతి భారతీయుడికి ధన్యవాదాలు" అని అన్నారు. జీఎంఆర్ స్పోర్ట్స్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సుజోరు గంగూలీ కూడా యువ ప్రతిభను ప్రోత్సహించడం, క్రీడా అభివ  ద్ధి, అథ్లెట్లకు వేదికలు స  ష్టించడంలో ఈ లీగ్ కీలకమని తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ హీరోస్ డిఫెన్స్, ఎదురుదాడులు అసాధారణంగా ఉన్నాయి. తావితా లెఫ్ట్ సైడ్ అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకున్నాడు. అర్డావో రెండు గోల్స్ సాధించి జట్టుకు బలం చేకూర్చాడు. ముంబై జట్టు వేగవంతమైన కదలికలతో పోరాడినా, హైదరాబాద్ క్లినికల్ ఫినిషింగ్‌తో విజయం సాధించింది. ఈ మ్యాచ్ రగ్బీ అభిమానులకు అద్భుతమైన అనుభవం అందించింది. హోమ్ టీమ్ విజయం హైదరాబాద్ క్రీడా ప్రేమికులను ఉత్సాహంగా నింపింది. మూడో స్థానం ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో చెన్నై బుల్స్ అద్భుత ఆరంభం చేసినా, బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్ సరియమనంతో తిరిగి వచ్చి విజయం సాధించింది. జుగల్ మాఝీ, షిల్టన్ వైక, జోనాస్ మికాల్సియస్, గణేష్ మాఝీ, మార్కస్ కెర్షా, ఫిలిపే సౌతురాగా, అక్కడ అకుయిలా రొకోలిసోవా వంటి ఆటగాళ్లు తమ నైపుణ్యం ప్రదర్శించారు. ఈ మ్యాచ్ కూడా ఉత్కంఠభరితంగా సాగింది. రగ్బీలో ఇలాంటి పోటీలు భారతదేశంలో క్రీడా స్థాయిని ఎంతో పెంచుతాయి. ఈ టోర్నమెంట్ భారత రగ్బీ చరిత్రలో మరో ముఖ్య అధ్యాయం. గత సీజన్ కంటే ఈసారి మరింత పెద్ద స్థాయిలో నిర్వహించడం, అంతర్జాతీయ ఆటగాళ్లు పాల్గొనడం,.. టెక్నాలజీ, బ్రాడ్‌కాస్ట్‌లో మెరుగైన సౌకర్యాలు లీగ్‌ను ఆకర్షణీయం చేశాయి. హైదరాబాద్ నగరం ఈ ఈవెంట్ ద్వారా ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా మారింది. యువతను రగ్బీ వైపు ఆకర్షించడం, క్షేత్రస్థాయి అభివ  ద్ధి చేయడం లక్ష్యంగా ఈ లీగ్ కొనసాగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి హాజరు ఈ క్రీడకు ప్రభుత్వ మద్దతును సూచిస్తుంది. రగ్బీ ప్రీమియర్ లీగ్ విజయం భారత క్రీడా రంగానికి కొత్త ఉత్సాహం అందించింది. హైదరాబాద్ హీరోస్ జట్టు ఆటగాళ్లు తమ నైపుణ్యం, టీమ్ స్పిరిట్‌తో చాంపియన్‌గా నిలిచారు. ఈ విజయం రగ్బీని భారతదేశంలో ప్రముఖ క్రీడగా మార్చడంలో సహాయపడుతుంది. అభిమానులు, స్పాన్సర్లు, నిర్వాహకులు అందరూ ఈ సక్సెస్‌కు దోహదపడ్డారు. ముందుకు ఇంకా మంచి సీజన్లు రాబోతున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ ఈవెంట్ తెలంగాణ, హైదరాబాద్‌కు గర్వకారణం.



# ఇరుముడి కట్టు
# లిరికల్ వీడియో విడుదల

మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది. పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.







## రెండు సినిమాలే అయినా
# ఎన్నో యుద్ధాలు చేశాం

**రాహుల్ సాంకృత్యాయన్‌కు విజయ్ బర్త్‌డే విషెస్**

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'రణ బాలి'. నేడు రాహుల్ పుట్టినరోజు సందర్భంగా విజయ్ ఆయనకు విషెస్ చెప్పారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సీ వాలా'ను గుర్తుచేసుకున్నారు. టాక్సీవాలా' వచ్చి తొమ్మిదేళ్లు దాటింది. ఈ తొమ్మిదేళ్లలో మనమిద్దరం ఎన్నో విషయాల్లో ఎదిగాం. అర్థవంతమైన కథలు రాయాలి.. ప్రేక్షకులను అలరించాలనే నీ పట్టుదలలో.. నీ పాత్రకు ప్రాణం పోయాలనే నా తపనలో ఎలాంటి మార్పూ రాలేదు. మనం కలిసి చేసింది కేవలం రెండు సినిమాలే.. అయినా వాటి కోసం ఎన్నో యుద్ధాలు చేశాం. ఎన్నో ఒడు దొడుకులు ఎదుర్కొన్నాం. అన్ని అడ్డంకుల మధ్య విడుదలైన మన మొదటి సినిమా. ప్రేక్ష కాదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడు రెండో చిత్రానికి కూడా నేను నీకు తోడుగా ఉన్నాను. మనం మళ్లీ ఆ ప్రేక్షకాదరణను పునరావృతం చేద్దాం. విజయాన్ని అందుకుందాం అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. రాహుల్ సినిమాలో భాగమవడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు విజయ్ తెలిపారు. ఆయన పనితనాన్ని ప్రపంచం చూడబోతున్నందుకు ఎంతో ఉత్సాహంగా ఉందని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక నటిస్తోన్న ఈ సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. 1854 నుంచి 1878 మధ్యకాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రం రూపొందుతోంది.



## నేడు వైజాగ్ లో
# లెనిన్
## ట్రైలర్ విడుదల

అక్కినేని అఖిల్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మాస్ కంబ్యాక మూవీ 'లెనిన్' ఇప్పుడు ప్రమోషన్స్‌లో వేగం పెంచింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. చిత్ర బృందం 'లెనిన్' థియేట్రికల్ ట్రైలర్‌ను జూన్ 30న విశాఖపట్నంలో గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించింది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని ప్రముఖ శరత్ థియేటర్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. ట్రైలర్ లాంచ్ కోసం ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అఖిల్ అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది.
ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో అఖిల్ పూర్తిస్థాయి రస్టిక లుకలో సైకిల్ తొక్కుతూ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ఏజెంట్' తర్వాత అఖిల్ నుంచి వస్తున్న ఈ సినిమా ఆయన కెరీర్‌కు కీలకంగా మారనుంది. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, ఈసారి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ కథను ఎంచుకోవడం విశేషం. ఈ చిత్రంలో అఖిల్ సరసన యువ నటి భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే బ్యాకగ్రౌండ్ స్కోర్, పాటలపై మంచి అంచనాలు నెలకొన్నాయి.

## బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మూవీ అరుదైన రికార్డు

టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన కెరీర్‌లో అరుదైన డిజిటల్ మైలురాయిని అందుకున్నారు. పలువురు స్టార్ హీరోలకు కూడా సాధ్యం కాని ఘనతను ఆయన సొంతం చేసుకుని సోషల్ మీడియాలో హాట్ టాపికగామారారు. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన 2017 యాక్షన్ ఎంటరటైనర 'జయ జానకి నాయక' హిందీ డబ్బింగ్ వెర్షన్ యూట్యూబ్‌లో ఏకంగా 1 బిలియన్ (100 కోట్ల) వ్యూస్ సాధించి సంచలనం సృష్టించింది. 'ఖుంఖార్' పేరుతో ప్రముఖ యూట్యూబ్ ఛానెల్‌లో విడుదలైన ఈ చిత్రం సంవత్సరాలు గడిచినా ప్రేక్షకాదరణను ఏమాత్రం కోల్పోలేదు. నెమ్మదిగా వ్యూస్



పెంచుకుంటూ వచ్చిన ఈ సినిమా ఇప్పుడు వంద కోట్ల వ్యూస్ మార్క్‌ను దాటడం విశేషం. దీంతో భారతీయ సినీ చరిత్రలో ఈ అరుదైన ఘనత సాధించిన చిత్రాల జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ రికార్డుతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పేరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. యూట్యూబ్‌లో ఒక ఫుల్ లెంగ్త్ డబ్బింగ్ సినిమాకు 1 బిలియన్ వ్యూస్ సాధించిన తొలి తెలుగు హీరోగా ఆయన నిలిచారు. టాలీవుడ్‌కు చెందిన అనేక బ్లాకబేస్టర్ చిత్రాలు హిందీలో డబ్ అయ్యి యూట్యూబ్‌లో విడుదలైనప్పటికీ, ఒక్క సినిమాతో ఈ స్థాయి వ్యూస్‌ను అందుకోవడం ప్రత్యేకమైన విజయంగా చెప్పవచ్చు.

## మెగా ఫోన్ పట్టిన
# రామ్ పోతినేని

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన సినీ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టను అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుతం రాపో23' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రం రామ్ కెరీర్‌లోనే అత్యధిక బ్జడెట్‌తో రూపొందుతున్న సినిమాగా నిలవనుంది. ఈ సినిమాతో రామ్ కేవలం హీరోగానే కాకుండా దర్శకుడిగా కూడా కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టడం విశేషం. ఇప్పటివరకు నటుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఈసారి మెగా ఫోన్ పట్టి దర్శకుడిగా కూడా తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు. అంతేకాకుండా ఈ చిత్రానికి సంబంధించిన ఒరిజినల్ స్టోరీని కూడా స్వయంగా రామ్ రాసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో సంప్రదాయబద్ధంగా 'రాపో23' పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. నిర్మాత కృష్ణ పోతినేని స్క్రిప్ట్‌ను రామ్‌కు అందజేయగా, సీనియర్ నటుడు మురళీమోహన్ ముహూర్తపు షాట్‌కు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ నిర్మాత పీవీ రవికిశోర్ క్లాప్ కొట్టగా, తొలి షాట్‌కు స్వయంగా రామ్ దర్శకత్వం వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభమైంది.



## కార్తికేయుడి కథతో
# ఎన్టీఆర్-త్రివిక్రమ్ మూవీ

ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో కొత్త మూవీ ప్రకటన వచ్చేసింది. పురాణాలతో ముడిపడిన కథతో ఈ చిత్రం రానుంది. ఇందులో ఎన్టీఆర్ కార్తికేయుడిగా కనిపించనున్నారు. ఇదే విషయాన్ని ఎన్టీఆర్ స్వయంగా ప్రకటించారు. 'శివుడి కుమారుడు.. పార్వతిదేవికి గర్వకారణం.. దేవ సేనాని.. మరోసారి త్రివిక్రమ్‌తో..' అంటూ ఎన్టీఆర్ పేర్కొన్నారు. శివ-పార్వతుల తనయుడు కార్తికేయుడి గురించి ఎన్నో పురాణగాథలు ప్రాచుర్యంలో ఉన్నా, వాటిని వెండితెరపై ఆవిష్కరించింది తక్కువే. తెలుగులో ఈ కథావస్తువుతో సినిమాలు కూడా పెద్దగా రాలేదు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు ఉన్నాయి. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని సబ్జెక్ట్‌ను త్రివిక్రమ్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. త్రివిక్రమ్ కలం సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించడానికి సిద్ధమైందని నాగవంశీ తెలిపారు.







## విశ్వనాథ్ అండ్ సన్స్
# విడుదలకు సిద్ధం

ప్రస్తుతం 'కరుప్పు' సినిమా భారీ విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు హీరో సూర్య. అదే ఉత్సాహంతో తన కొత్త సినిమా గురించి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య హీరోగా నటిస్తున్న చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. ఈ సినిమాలో సూర్య అభిమానులకు ఓ స్పెషల్ ట్రీట్ ఇవ్వనున్నారు. 2014లో వచ్చిన 'అంజన్' మూవీలో 'ఏక దో తీన్' పాట పాడిన సూర్య.. మళ్లీ ఇన్నాళ్లకు ఈ సినిమా కోసం గొంతు సవరించుకున్నారు. ఇందులో సూర్య స్వయంగా ఓ పాట పాడారు. ఇదొక పూర్తి స్థాయి హుషారైన డ్యాన్స్ నంబర్ అని తెలుస్తోంది. ఈ పాటకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం ఇవ్వగా.. కెన్ కరుణాస్ లిరిక్స అందించారు. ఈ విషయాన్ని జీవీ ప్రకాష్ ఎక్స వేదికగా వెల్లడించారు. సూర్య పాడిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలవనుంది. ఇటీవల ఈ సినిమాలోని 'నేనో బటర్‌ఫ్లై' పాటకు మంచి స్పందన వచ్చింది. ఇక ఈ చిత్రంలో సూర్య సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్, సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

# అంత్యక్రియలపై ఇంత భావోద్వేగమా
## నెటిజన్ల ప్రశ్నలను సమర్థించిన రాధిక



ఇటీవల నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ గుండెపోటుతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. కుటుంబ సభ్యులు, మిత్రులు, సన్నిహితులు, పలువురు అభిమానులు ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు.. నటీనటులు భావోద్వేగాలకు గురైన ఫొటోలు, వీడియోలు తీసి, వాటిని సోషల్‌మీడియాలో పంచుకున్నారు. అవి కాస్త వైరల్ అయ్యాయి. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ 'అంత్యక్రియలనేవి దుఃఖంతో బాధపడుతున్న కుటుంబ సభ్యులకు సంబంధించిన వ్యక్తిగత వ్యవహారం. హంగామా చేసేందుకు, వ్యూస్ కోసం ప్రయత్నించే వేదిక కాదు. అంతిమ సంస్కారాల సమయంలో కచ్చితంగా మీడియాను నిషేధించాల్సిందే' అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌ను నటి రాధిక సమర్థించారు. 'కచ్చితంగా నిషేధం విధించాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాగ్యరాజ్‌తో ఉన్న అనుబంధాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. 50 ఏళ్ల స్నేహానికి తుది వీడ్కోలు. అద్భుత సృష్టికర్త, పరిణతి కలిగిన రచయిత, సినిమాకు అద్భుతమైన సరిహద్దులు నిర్దేశించిన వ్యక్తి. ఆయనతో పంచుకున్న చిరునవ్వుల జ్ఞాపకాలెన్నో. ఎక్కడా ఆర్భాటం లేకుండా ప్రతి సందర్భంలోనూ నా కుటుంబానికి అండగా నిలిచిన వ్యక్తి. నిజంగా ఇది షాకింగ్ వీడ్కోలు అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులు, అభిమానులు బాధాతప్త హృదయంతో నివాళులర్పించాల్సిన ప్రదేశం ఒక సర్కస్ అయిపోయింది. ఇంత కఠినంగా మనం ఎప్పుడు మారిపోయాం. ప్రభుత్వం, చిత్ర పరిశ్రమ దీనిపై చర్చించాలి. అంత్యక్రియల సమయంలో సరైన ప్రొటోకాల్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. చనిపోయిన వారి భౌతిక కాయానికి, ఆత్మకు సముచిత గౌరవం ఇవ్వాలి' అని నటి ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు సీఎంఓ, ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్, నడిఘర్ సంఘం, ప్రెస్ కౌన్సిల్‌ను ట్యాగ్ చేశారు. కె.భాగ్యరాజ్ అంతిమయాత్రలో అత్యుత్సాహం ప్రదర్శించిన వారిపై నటి సుహాసిని కూడా మండిపడిన వీడియోలు తాజాగా వైరల్ అవుతున్నాయి.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com